సాక్షి ఖమ్మం

మంగళవారం । 15 । ఆగస్టు । 2023



.. నిర్వాహకులకు నోటీసులు

పెద్దాస్పత్రిలోని డయాలసిస్ సెంటర్‌లో ఎయిడ్స్ బాధితులకు డయాలసిస్ చేయని అంశంపై నోటీసులు ఇచ్చారు. IIలో



పసికందును వదిలేశారు..

నెల వయస్సు ఉన్న మగ శిశువును గుర్తు తెలియని వ్యక్తులు ఓ ఇంటి ఆవరణలో వదిలి వెళ్లగా అధికారులు శిశుగృహలో చేర్చారు. IIలో

గరిష్టం / కనిష్టం
34° / 25°

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

నేడు సీనియర్ సిటిజన్లకు రాయితీ

ఖమ్మం మామిళ్లగూడెం: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా టీఎస్ ఆర్టీసీ సంస్థ సీనియర్ సిటిజన్లకు ఆఫర్ ప్రకటించింది. ఈమేరకు మంగళవారం పల్లెవెలుగు బస్సుల్లో ప్రయాణించే వారికి రాయితీ అమలవుతుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తిరిగే పల్లెవెలుగు సర్వీసుల్లో సీనియర్ సిటిజన్లకు టికెట్‌లో 50శాతం రాయితీ ఉంటుందని ఖమ్మం డిపో మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.


'నవోదయ'లో ప్రవేశాలకు దరఖాస్తులు

ఖమ్మం సహకారనగర్: పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2024–25వ విద్యాసంవత్సరానికి ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 17వ తేదీలోగా www.navodaya.gov.in వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ సోమశేఖరశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, అర్హత పరీక్ష 2024 జనవరి 20న ఉంటుందని పేర్కొన్నారు.

ఈనెలాఖరు వరకు ప్రవేశాలు

బోనకల్: మధ్యలో చదువు మానేసిన వారే కాకుండా చిరుద్యోగులు పదోన్నతుల కోసం ఓపెన్ స్కూల్ విద్యావిధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు సూచించారు. ఓపెన్ స్కూల్ విధానంలో పదో తరగతి, ఇంటర్ ప్రవేశాలపై అవగాహన కోసం రూపొందించిన పోస్టర్లను సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెలాఖరు వరకు గడువు ఉన్నందున ఆసక్తి ఉన్నవారు ప్రవేశాలు పొందొచ్చని తెలిపారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ పున్నంచందర్, ఎంపీడీఓ అశోక్‌తో పాటు షేక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

తీగల వంతెనకు ముందడుగు!



మున్నేటిపై ఉన్న పురాతన కాలం నాటి బ్రిడ్జి

టెండర్ షెడ్యూల్ విడుదల చేసిన ప్రభుత్వం

- గత జనవరిలో ప్రకటన, రూ.180 కోట్లు మంజూరు
- మంత్రి పువ్వాడ కృషితో శరవేగంగా ప్రక్రియ
- త్వరలోనే శంకుస్థాపన చేయనున్న మంత్రులు కేటీఆర్, ప్రశాంత్‌రెడ్డి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లా కేంద్రంలోని మున్నేరుపై తీగల వంతెన నిర్మాణానికి సంబంధించి ముందడుగు పడింది. ఇప్పటికే ప్రభుత్వం రూ.180 కోట్లు మంజూరు చేయగా.. ఇప్పుడు బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి టెండర్ షెడ్యూల్ విడుదల చేశారు. టెండర్లు దాఖలు చేసేందుకు ఈనెల 28 వరకు అవకాశం కల్పించగా, తీగల వంతెన నిర్మాణానికి త్వరలోనే మంత్రులు కేటీఆర్, ప్రశాంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఈ సందర్భంగా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే రాకపోకలు సాఫీగా సాగడమే కాక పర్యాటకంగా ఖమ్మంలో మరో ఆకర్షణ చేరినట్లవుతుంది.

ఇబ్బందులు తప్పేలా...

ఖమ్మం నగరంలో మున్నేరుపై పాతకాలం నాటి బ్రిడ్జి ఉంది. ఖమ్మం నుంచి హైదరాబాద్, వరంగల్, నల్లగొండ, మిర్యాలగూడ తదితర నగరాలకు రాకపోకలకు ఇదే వారధి కాగా.. జనాభా, వాహనాలు పెరగడంతో తరచూ ట్రాఫిక్ ఇక్కట్లు ఎదురవుతున్నాయి. రోడ్డు వెడల్పు తక్కువ ఉన్న కారణంగా ప్రమాదాలు పరిపాటిగా మారాయి. అలాగే, ఏటా వర్షాకాలంలో వరద పెరిగితే మున్నేరు బ్రిడ్జిపై రాకపోకలు నిలిపేస్తున్నారు. దీంతో ఇక్కడ నూతన బ్రిడ్జి ఆవశ్యకతను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో జనవరి 18న బీఆర్ఎస్ ఆవిర్భావ సభలో ముఖ్యమంత్రి తీగల వంతెన మంజూరు చేస్తున్నట్లు ప్రకటించగా.. మరుసటి రోజు నిధులు కూడా విడుదల చేశారు.

టెండర్ల ఆహ్వానం

హైదరాబాద్‌లోని దుర్గం చెరువు తరహాలో మున్నేరుపై తీగల వంతెన నిర్మాణం చేపట్టనున్నారు. 300 మీటర్లు కేబుల్‌పై ఈ బ్రిడ్జి నిలవనుండగా... 390 మీటర్లు బాక్స్ ఆకారంలో వయాడక్ట్ బ్రిడ్జి నిర్మిస్తారు. ఇందుకోసం సోమవారం ప్రభుత్వం టెండర్ల ప్రక్రియ ప్రారంభించింది. ఈనెల 28 వరకు టెండర్ దరఖాస్తుకే అవకాశం ఉండగా, ఇది పూర్తయ్యాక మంత్రులు కేసీఆర్, ప్రశాంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు.

పంద్రాగస్ట్‌కు సిద్ధం..



పరేడ్ మైదానంలో ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న కలెక్టర్ గౌతమ్, సీపీ వారియర్

ఖమ్మం సహకారనగర్/ఖమ్మం క్రైం: స్వాతంత్ర్య వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్, జిల్లా పరిషత్ తదితర కార్యాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. కాగా, జిల్లా కేంద్రంలోని పరేడ్ మైదానంలో మంగళవారం ఉదయం 10.30గంటలకు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. అలాగే, 11గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 11–30గంటలకు ఉద్యోగులకు ప్రశంసాపత్రాల పంపిణీ ఉంటాయి. ఈసందర్భంగా ఏర్పాట్లను కలెక్టర్ గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్ పరిశీలించారు. జాతీయ పతాకావిష్కరణ, కవాతు, సాంస్కృతిక ప్రదర్శనలకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈకార్యక్రమంలో ఏసీపీలు గణేష్, ప్రసన్నకుమార్, సారంగపాణి, నర్సయ్య, తహసీల్దార్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించాలి

సెక్టార్ అధికారుల శిక్షణలో కలెక్టర్ గౌతమ్



చీమలపాడు మృతుడి భార్యకు పరిహారం చెక్కు అందజేస్తున్న కలెక్టర్ గౌతమ్, పక్కన అదనపు కలెక్టర్ అభిలాష, మధుసూదన్

ఖమ్మం సహకారనగర్: అధికారులు తమ పరిధిలోని ప్రతీ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి వసతులపై ఆరా తీయాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం సెక్టార్ అధికారులకు ఏర్పాటుచేసిన శిక్షణలో ఆయన మాట్లాడారు. సెక్టార్ అధికారులు.. రిటర్నింగ్ అధికారికి క్షేత్రస్థాయిలో అండగా నిలిచి ఎన్నికలు పక్కాగా జరిగేలా పర్యవేక్షించాలని తెలిపారు. ఈసమావేశంలో కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, ఆర్డీఓలు గణేష్, అశోక్‌చక్రవర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి, మాస్టర్ ట్రెయినర్ కె.శ్రీరామ్ పాల్గొన్నారు.

జీఓ 59పై విస్తృత ప్రచారం

ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఏర్పరచుకున్న వారు క్రమబద్ధీకరించుకునేందుకు విడుదలైన జీఓ 59పై విస్తృత ప్రచారం చేయాలని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. హైదరాబాద్ నుండి సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఈ అంశంపై వీసీ ద్వారా సూచనలు చేయగా... అనంతరం కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. మొదటి విడత డిమాండ్ నోటీసు తీసుకున్న వారు వారంలోగా నగదు చెల్లించేలా చూడాలని తెలిపారు.

ఎక్స్‌గ్రేషియా చెక్కు అందజేత

కారేపల్లి మండలం చీమలపాడులో సిలిండర్ పేలిన ఘటనలో మృతి చెందిన సందీప్ మహాదేవ్ కన్నకే కుటుంబానికి ప్రభుత్వం రూ.6లక్షల పరిహారం విడుదల చేసింది. ఈ సందర్భంగా ఆయన భార్య మామినకు కలెక్టర్ గౌతమ్ చెక్కు అందించారు. ఈసమావేశాల్లో అదనపు కలెక్టర్లు అభిలాష అభినవ్, ర్ డి.మధుసూదన్ నాయక్, ఆర్డీఓ గుంటుపల్లి గణేష్, తహసీల్దార్ శైలజ, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు మదన్‌గోపాల్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు

ఫిర్యాదులు పరిష్కరించండి

గ్రీవెన్స్ డేలో ప్రజలు ఇచ్చే ప్రతీ ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన పలువురి నుంచి ఫిర్యాదులు స్వీకరించాక పరిష్కారంపై అధికారులకు సూచనలు చేశారు. అలాగే, ధరణి ద్వారా జీపీఏ కోసం వచ్చిన దరఖాస్తులను ఆమోదించినట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. గ్రీవెన్స్ డేలో పలువురు ఈ అంశంపై విన్నవించగా అప్పటికప్పుడే దరఖాస్తులను పరిశీలించి ఆమోదించారు.

ఇంటింటికీ జాతీయ పతాకం

హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా తెలంగాణ హ్యాండ్లూమ్స్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ నుండి లక్ష జాతీయ పతాకాలు జిల్లాకు చేరాయి. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ వీటిని ఆవిష్కరించి మాట్లాడుతూ జిల్లాలో ఇంటింటికీ పంపిణీ చేయాలని ఆదేశించారు.

42 వేల జాతీయ జెండాల విక్రయం



న్యాయవాదికి జెండాలను అందజేస్తున్న తపాలా ఉద్యోగి వెంకటేశ్వర్లు

ఖమ్మంగాంధీచౌక్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని 'హర్ ఘర్ తిరంగా' పేరిట ఖమ్మం తపాలా డివిజన్ పరిధిలో 42 వేల జాతీయ జెండాలను విక్రయించారు. ఖమ్మం తపాలా డివిజన్ పరిధిలోని ఖమ్మం, కొత్తగూడెం, భద్రాచలం హెడ్ పోస్టాఫీసులు, వాటి పరిధిలో ఉన్న సబ్ పోస్టాఫీసులు, బ్రాంచ్ పోస్టాఫీసుల్లో కొద్ది రోజులుగా జెండాలు విక్రయిస్తున్నారు. ఈమేరకు రూ.25 చొప్పున తపాలా కార్యాలయాల్లోనే కాక, ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారికి ఇంటి వద్ద అందజేశారు. భద్రాచలంలోని సీఆర్‌పీఎఫ్ క్యాంపు అధికారులు వెయ్యి జెండాలు, ఖమ్మంకు చెందిన న్యాయవాది 150 జెండాలను కొనుగోలు చేశారు. ఖమ్మం డివిజన్‌కు కేటాయించిన జాతీయ జెండాలన్నింటినీ విక్రయించిన తపాలా ఉద్యోగులను సూపరింటెండెంట్ బి.రవికుమార్ అభినందించారు. అలాగే, జెండాలు కొనుగోలు చేసి దేశభక్తి చాటిన జిల్లా వాసులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఒకేరోజు రూ.2లక్షల విలువైన ఫోన్ల గుర్తింపు

- మూడు నెలల్లో 200 ఫోన్ల అప్పగింత
- సీఈఐఆర్ లాభాలను వివరించిన సీపీ వారియర్



గ్రీవెన్స్‌లో ఫిర్యాదు వివరాలు తెలుసుకుంటున్న సీపీ వారియర్

ఖమ్మంక్రైం: పోలీస్‌శాఖ ప్రవేశపెట్టిన సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్(సీఈఐఆర్) పోర్టల్ సేవల ద్వారా సైబర్ బృందం సోమవారం ఒక్కరోజే రూ.2లక్షల విలువైన ఫోన్లను గుర్తించింది. బాధితులు పోగొట్టుకున్న ఫోన్లను గుర్తించి సీపీ విష్ణు ఎస్.వారియర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ మూడు నెలల కాలంలో రూ.30లక్షల విలువైన 200 ఫోన్లను గుర్తించి యజమానులకు అప్పగించినట్లు తెలిపారు. మొబైల్ ఫోన్ ఎక్కడైనా పోగొట్టుకున్నా, చోరీ అయినా గుర్తించడం కష్టమయ్యేదని తెలిపారు. కానీ సీఈఐఆర్ సేవలు అందుబాటులోకి వచ్చాక ఫోన్ పోగొట్టుకున్న వారు వివరాలు నమోదు చేశాక తక్కువ వ్యవధిలోనే గుర్తించి అందచేస్తున్నామని చెప్పారు. ఈసందర్భంగా ఫోన్లు రికవరీ చేసిన సైబర్ క్రైమ్ ఎస్‌ఐ రంజిత్‌కుమార్, కానిస్టేబుల్ సంతోష్‌ను ఆయన అభినందించారు.

గ్రీవెన్స్‌కు స్పందన

ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు పోలీస్ కమిషనరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌లో ఈ వారం 25 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్న సీపీ విష్ణు ఎస్.వారియర్... క్షేత్ర స్థాయిలో విచారించి పరిష్కరించాలని ఉద్యోగులకు సూచించారు.

వైన్స్‌కు 763 దరఖాస్తులు



ఖమ్మంక్రైం: నూతన ఎక్సైజ్ పాలసీలో భాగంగా జిల్లాలో 122 వైన్స్‌కు టెండర్లు స్వీకరిస్తుండగా, సోమవారం 763 దరఖాస్తులు అందాయి. కాగా, ముందు రోజు ఆదివారం, తర్వాత రోజు స్వాతంత్ర్య దినోత్సవ సెలవు ఉండడంతో వెయ్యికి పైగా దరఖాస్తులు వస్తాయని అధికారులు భావించినా అలా జరగలేదు. కాగా, ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్–1 పరిధిలో 171, స్టేషన్–2లో 116, నేలకొండపల్లిలో 133, వైరాలో 175, మధిరలో 231, సత్తుపల్లిలో 274, సింగరేణి స్టేషన్ పరిధిలో 140 దరఖాస్తులు వచ్చాయని అధికారులు వెల్లడించారు. ఇప్పటివరకు మొత్తంగా 2,070 దరఖాస్తులు అందగా, స్వీకరణ గడువు 18వ తేదీతో ముగియనుంది.

పాలేరుకు ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల

- ఈ విద్యాసంవత్సరం నుండే ప్రవేశాలు
- ఐదు బ్రాంచ్‌లు.. అరవై చొప్పున సీట్లు

కూసుమంచి: పాలేరు నియోజకవర్గానికి ప్రభుత్వం జేఎన్‌టీయూ అనుబంధంగా ఇంజనీరింగ్ కళాశాలను మంజూరు చేసింది. ఈమేరకు ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ సోమవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ విద్యాసంవత్సరం నుండే ప్రవేశాలు చేపట్టి తరగతులు నిర్వహించనున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బీటెక్‌లో సీఎస్‌ఈ, సీఎస్‌ఈ(డేటా సైన్స్), ఈసీఈ, ఈఈఈ, మెకానికల్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌ల్లో 60 సీట్లు చొప్పున కేటాయించారు. కాగా, పాలేరు నియోజకవర్గానికి మంజూరైన ఈ కళాశాలను ఖమ్మం రూరల్ మండలంలో ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం.

బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.14.52 కోట్లు

పాలేరు నియోజకవర్గంలో బీటీ రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం రూ.14.52 కోట్లు మంజూరు చేసింది. కూసుమంచి మండలంలో తురకగూడెం నుండి కిష్టాపురం వరకు రూ.1.08 కోట్లు, తురకగూడెం నుండి చింతలతండా వరకు రూ.1.80 కోట్లు, లింగారంతండా నుండి గట్టుసింగారం వరకు రూ.1.85 కోట్లు, లింగారం తండా నుండి గన్యాతండా వరకు రూ.80 లక్షలతో రహదారులు నిర్మించనున్నారు. అలాగే, నేలకొండపల్లి మండలం రాయిగూడెం నుండి మంగాపురం తండా వరకు రూ.2.22 కోట్లు, రాజారంపేట నుండి బుద్దారం వరకు రూ.85లక్షలు, తిరుమలాయపాలెం మండలంలో బంధంపల్లి నుండి హస్నాబాద్ వరకు రూ.4.5 కోట్లు, మేడిదపల్లి నుండి బీరోలు వరకు రూ.1.87 లక్షల వ్యయంతో బీటీ రహదారులు నిర్మిస్తారు. కాగా, ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల, రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంపై సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

పసికందును వదిలివెళ్లిన వ్యక్తులు


కమిటీ బాధ్యులకు పసికందును అప్పగిస్తున్న అధికారులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం రాపర్తినగర్(పాత డీఆర్‌డీఏ) సమీపాన ఓ ఇంటి గేటు లోపల నెల వయసు కలిగిన మగశిశువును గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం వదిలేసి వెళ్లారు. ఈ విషయాన్ని గుర్తించిన స్థానిక మహిళ టూటౌన్ పోలీసులు, సమీపంలోని బాల రక్షాభవన్ అధికారులకు సమాచారం ఇవ్వగా ఖమ్మం టూటౌన్ సీఐ కుమార స్వామి, బాల రక్షా భవన్ అధికారులు పసికందును చేరదీసి బాలల సంక్షేమ కమిటీ బాధ్యులకు అప్పగించారు. దీంతో బాబును బాలల సంక్షేమ కమిటీ ప్రతినిధులు లక్ష్మయ్య, అనిత, చైల్డ్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ కె శ్రీనివాస్ స్థానిక శిశు గృహకు తీసుకెళ్లారు. కాగా, వ్యవహారంపై ఖమ్మం టూటౌన్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఎంపీ సిఫారసుతో రూ.5 లక్షల ఎల్‌ఓసీలు

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నాయకుడు, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు సిఫారసుతో ముగ్గురు చికిత్స చేయించుకునేందుకు రూ.5 లక్షల ఎల్ఓసీ మంజూరైంది. అనారోగ్య సమస్యలతో ఆస్పత్రుల్లో చేరిన వారి పరిస్థితి తెలుసుకున్న ఎంపీ నామ.. సీఎం కేసీఆర్‌కు నివేదించారు. దీంతో బోనకల్ మండలం చిరునోములకు చెందిన ఎం.భారతి, ముదిగొండ మండలం చిరుమర్రికి చెందిన ఎస్.వెంకటయ్య, ఖమ్మం గుట్టలబజార్‌కు చెందిన కె.లక్ష్మికి కలిపి రూ.5లక్షల విలువైన ఎల్ఓసీ మంజూరు చేయించగా వారు ఎంపీకి సోమవారం కృతజ్ఞతలు తెలిపారు.

ఆకట్టుకునేలా అశోకచక్రం..

సత్తుపల్లి మున్సిపాలిటీలో ఆవిష్కరించిన ఎమ్మెల్యే వెంకటవీరయ్య

సత్తుపల్లి: సత్తుపల్లి మున్సిపాలిటీ ఆవరణలో ఏర్పాటుచేసిన అశోకచక్రంను ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్తుపల్లిలో ఈ చిహ్నం సెల్ఫీపాయింట్‌గా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

పిల్లలకు రూ.50 వేల వితరణ

సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పుట్టిన రోజు పురస్కరించుకొని బీఆర్ఎస్ నాయకులు శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, కొండపల్లి రమేష్‌రెడ్డి, గోగులమూడి బాలాజీరెడ్డి, దుక్కిదేవర యుధిస్టర్ రూ.50వేలను అనాథ పిల్లలకు అందజేశారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఈ నగదును పిల్ల లకు ఎమ్మెల్యే అందజేసి, నాయకులను అభినందించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కమిషనర్ కె.సుజాత, ఏసీపీ రామానుజం, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, ఆత్మ చైర్మన్ వనమా వాసుతో పాటు శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, గోగులమూడి బాలాజీరెడ్డి, ఎస్.కే.రఫీ, మల్లూరు అంకమరాజు, మట్టా ప్రసాద్, చిత్తలూరి ప్రసాద్, కొండపల్లి రమేష్‌రెడ్డి, ఎస్.కే.అబ్దుల్లా పాల్గొన్నారు.


సత్తుపల్లి మున్సిపాలిటీలో అశోకచక్రాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే వెంకటవీరయ్య, ప్రజాప్రతినిధులు, అధికారులు

నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

గ్రామీణ ప్రాంత నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో మెగా జాబ్‌మేళా నిర్వహించామని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. స్థానిక జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం 37 కంపెనీల ఆధ్వర్యాన జాబ్‌మేళాకు 1,423 మంది హాజరుకాగా, 200 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంపికైన వారికి 18వ తేదీన నియామకపత్రాలు అందజేస్తామని తెలిపారు.


పిల్లలకు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య

'సాయిస్ఫూర్తి'లో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ శిక్షణ


ట్రెయినర్లతో కళాశాల యాజమాన్యం, విద్యార్థులు

సత్తుపల్లిరూరల్: మండలంలోని గంగారం సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం హెటిరో సంస్థ ఆధ్వర్యాన క్యాంపస్ రిక్రూట్మెంట్ శిక్షణ ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఎం.జగదీష్, షేక్ పాషా, ఎస్.రాంగోపాల్ పలు అంశాలపై అవగాహన కల్పించారు. క్యాంపస్ ఇంటర్వ్యూలకు సిద్ధం కావాల్సిన విధానం, బయోడేటా తయారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలే కాక, ఇంటర్వ్యూ నైపుణ్యాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పూటుకూరి శేషారత్నకుమారి మాట్లాడగా సెక్రటరీ, కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ చెన్నపాటి విజయ్‌కుమార్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జ్ బత్తిని సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జ్యేష్ట లక్ష్మణరావు కుటుంబానికి పరామర్శ

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి లారీ ఓనర్ల అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు జ్యేష్ట లక్ష్మణరావు(47) అనారోగ్యంతో కిష్టారంలో ఆదివారం రాత్రి మృతి చెందారు. ఈమేరకు సోమవారం ఆయన మృతదేహం వద్ద ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకురాలు మట్టా రాగమయి వేర్వేరుగా నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు. లారీ యూనియన్ అధ్యక్షుడు కొండపల్లి రమేష్‌రెడ్డితో పాటు ఉడతనేని అప్పారావు, సర్పంచ్ రేణుక తదితరులు పాల్గొన్నారు.

సీడీసీ చైర్మన్‌కు...

పెనుబల్లి: కల్లూరు సీడీసీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు ముక్కర భూపాల్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతుండగా ఎమ్మెల్యే వెంకటవీరయ్య వీఎం బంజర్‌లో పరామర్శించారు. జెడ్పీటీసీ చెక్కిలాల మోహన్‌రావు, నాయకులు కనగాల వెంకట్రావు, వంగా గిరిజాపతిరావు, భూక్యా ప్రసాద్ పాల్గొన్నారు.

ట్రాక్‌కు మరమ్మతులతో ఆగిన 'బెళగావి'

కారేపల్లి: రైల్వే ట్రాక్‌కు అత్యవసర మరమ్మతులు చేపట్టడంతో బెళగావి నుంచి మణుగూరు ఎక్స్‌ప్రెస్ రైలు సోమవారం సుమారు గంటన్నర పాటు పాటు కారేపల్లి రైల్వేస్టేషన్‌లో నిలిచింది. ఈ రైలు సోమవారం మధ్యాహ్నం 2.30కు గంటలకు కారేపల్లికి చేరుకోగా, అప్పటికే మండలంలోని చీమలపాడు నుండి గాంధీపురం మధ్య అత్యవసరంగా ట్రాక్ మరమ్మతులు చేపడుతున్నారు. దీంతో రైలును నిలిపివేయగా, పనులు పూర్తయ్యాక సాయంత్రం 4గంటలకు కొత్తగూడెం వైపు బయలుదేరింది.

ఇన్‌చార్జ్ బిల్ కలెక్టర్ సస్పెండ్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లోని ఇన్‌చార్జి బిల్ కలెక్టర్ పి.వెంకటేష్‌ను సస్పెండ్ చేస్తూ కమిషనర్ ఆదర్శ్ సురభి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. నెల రోజులుగా విధులకు హాజరుకాకపోవడంతో ఆయనను సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. గృహలక్ష్మి దరఖాస్తులను ఆన్‌లైన్ చేసేందుకు రావాలని చెప్పినా శని, ఆదివారాల్లో ఎందుకు రాలేదని ప్రశ్నించినట్లు సమాచారం. సిబ్బంది కేటాయించిన విధులను బాధ్యతగా పూర్తిచేయకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు తెలిసింది.

ఇంటిపై పడిన జామాయిల్ చెట్టు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని విరాట్‌నగర్‌లో సోమవారం ఓ భారీ జామాయిల్ చెట్టు ఇంటిపై పడింది. కాలనీకి చెందిన సిద్దు వీరబ్రహ్మాచారి ఇంటిపై అటవీ కార్పొరేషన్‌కు చెందిన జామాయిల్‌చెట్టు కూలగా సమీపంలోని విద్యుత్ స్తంభం విరిగిపోయింది. దీంతో తీగలు కూడా తెగిపోయినా ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పినట్లయింది. అనంతరం విద్యుత్ ఉద్యోగులు చెట్టును తొలగించి మరమ్మతులు చేసి సరఫరా పునరుద్ధరించారు.

వివాహితపై వేధింపులు, కేసు నమోదు

కల్లూరు: మండలంలోని వీరబ్రహ్మేంద్ర కాలనీకి చెందిన వివాహితపై ఆమె భర్త, అత్తమామలు వేధిస్తుండడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వీరబ్రహ్మేంద్ర నగర్‌కు చెందిన జగ్గారపు రమ్యకు పెద్దకోరుకొండి వాసి వెంకటకృష్ణాచారితో ఈ ఏడాది జనవరి 26న వివాహం జరిగింది. వరకట్నంగా నగదు, బంగారం, గృహ సామగ్రి ఇచ్చారు. అయితే, అనుమానంతో పాటు అదనపు కట్నం తీసుకురావాలని రమ్యను వెంకటకృష్ణాచారితో పాటు ఆయన తల్లిదండ్రులు ఇందిరమ్మ, వెంకటేశ్వరరావు వేధిస్తున్నారు. దీంతో రమ్య ఫిర్యాదు మేరకు ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

రహదారి నిర్మాణానికి రూ.85 లక్షలు

చింతకాని: మండలంలోని వందనంలో ఆర్‌అండ్‌బి రహదారి నుంచి శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయం వరకు రహదారి నిర్మాణానికి ప్రభుత్వం రూ.85 లక్షలను మంజూరు చేసింది. ఈ విషయాన్ని సర్పంచ్ కొరిపల్లి సునీత వెల్లడించారు. గ్రామంలోని రామలింగేశ్వర స్వామి ఆలయానికి వెళ్లేందుకు రహదారి సక్రమంగా లేక భక్తులు పడుతున్న ఇబ్బందులను జెడ్పీ చైర్మన్ లింగాల కమలరాజ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన నిధులు మంజూరు చేయించారని తెలిపారు.

చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలు

ఖమ్మంలీగల్: తీసుకున్న అప్పు తీర్చే క్రమంలో చెల్లని చెక్కు ఇచ్చిన వ్యక్తికి ఆరునెలల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. వివరాలు... ఖమ్మంకు చెందిన మహంతి వీరరాఘవ వద్ద ఖమ్మం రూరల్ మండలం గోళ్లపాడుకు చెందిన పఠాన్ జానీ వ్యాపార అవసరాల కోసం 2015లో మూడు విడతలుగా రూ.3లక్షల అప్పు తీసుకున్నాడు. అయితే, 2018 మార్చి 17న రూ.350లక్షలకు చెక్కు ఇచ్చినా ఖాతాలో సరిపడా నగదు లేక బౌన్స్ అయింది. దీంతో వీరరాఘవ న్యాయవాది రాయల రవికుమార్ ద్వారా లీగల్ నోటీస్ జారీ చేసి కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశాడు. ఈమేరకు జానీకి ఆరు నెలల జైలుశిక్ష విధించడమే కాక ఫిర్యాదికి రూ.3.50లక్షలు చెల్లించాలని ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి రాళ్లబండి శాంతిలత సోమవారం తీర్పు చెప్పారు.

మున్నేరులో పడి యువకుడు మృతి

అనుమానాలు ఉన్నాయని కుటుంబీకుల ఆరోపణ


వినోద్ (ఫైల్)

ఖమ్మంక్రైం: మున్నేరులో పడిన ఓ యువకుడు మృతి చెందిన ఘటన ఖమ్మం త్రీటౌన్ పరిధిలో చోటు చేసుకుంది. అయితే తమ ఆయనను నీళ్లలో పడేసి హత్య చేశారని కుటుంబీకులు ఆరోపిస్తూ మృతదేహన్ని తరలించకుండా అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. వివరాలిలా ఉన్నాయి. పంపింగ్ వెల్ రోడ్డు ప్రాంతంలోని వడ్డెర కాలనీకి చెందిన గుంజా వినోద్(24) కూలి పని చేస్తూ జీవిస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన కొందరితో కలిసి ఆయన సోమవారం మధ్యాహ్నం చేపల వేటకు పంపింగ్ వెల్ ప్రాంతంలోని మున్నేరు చప్టా వద్దకు వెళ్లారు. అక్కడ చేపలు పడుతుండగా వినోద్ నీళ్లలో జారిపడి మునిగాడు. దీంతో ఆయనతో ఉన్న వారు బయటకు తీయగా అప్పటికే వినోద్ తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లి అక్కడి నుంచి ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆతర్వాత మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా వినోద్ తండ్రి రామకృష్ణ, కుటుంబసభ్యులు అడ్డుకున్నారు. తమ కుమారుడిన్ని నీళ్లలో పడేసి హత్య చేశారని, బాధ్యులపై కేసు చేయాలని డిమాండ్ చేయడంతో ఉద్రిక్తత నెలకొంది. దీంతో పోలీసులు వారికి సర్దిచెప్పి మార్చురీకి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

ముదిగొండ: మండల కేంద్రంలోని తాళం వేసిన ఇంటి కిటికీల అద్దాలు పగులగొట్టిన గుర్తు తెలియని వ్యక్తులు రూ.50వేల నగదు చోరీ చేశారు. వివరాలిలా ఉన్నాయి. ముదిగొండకు చెందిన షేక్ లాల్‌సాహెబ్ ఈనెల 12న ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలంలోని డబాబ్‌పల్లిలోని పెళ్లికి భార్యతో కలిసి వెళ్లి ఆదివారం రాత్రి వచ్చారు. అప్పటికే ఇంటి కిటికీల అద్దాలు పగులగొట్టి ఉండడంతో పరిశీలించగా రూ.50వేలు నగదు చోరీ అయినట్లు గుర్తించాడు. దీంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ గజ్జెల నరేష్ క్లూస్ టీంతో కలిసి పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

ప్రహరీ కూల్చిన వారికి దేహశుద్ధి

తల్లాడ: ఓ వ్యక్తి కొనుగోలు చేసిన స్థలంలో నిర్మించిన ప్రహరీని కూల్చివేసిన వ్యక్తి, ఆయనతో ఉన్న వారిని స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేశారు. తల్లాడకు చెందిన మొక్కా కృష్ణ.. బండారు నర్సింహారావు వద్ద నాలుగేళ్ల క్రితం స్థలం కొనుగోలు చేశాడు. ఆ స్థలంలో చికెన్ షాపు ఏర్పాటుచేసి పడమర వైపు ప్రహరీ నిర్మించాడు. అయితే, అది తన స్థలమంటూ ఖమ్మంలో ఉంటున్న బండారు విశ్వనాథం సోమవారం పలువురితో వచ్చి కూల్చివేశాడు. దీంతో కోపోద్రిక్తులైన కృష్ణ, ఆయన బంధువులు కలిసి విశ్వనాథం సహా ఖమ్మం నుంచి వారిని స్తంభానికి కట్టేసి కొట్టారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు చేరుకుని ఇరువర్గాల వారిని స్టేషన్‌కు తీసుకెళ్లగా పరస్పరం ఫిర్యాదు చేశారు.


స్తంభానికి కట్టేసి ఉన్న వ్యక్తి

మహిళ మెడలో బంగారు గొలుసు...

తల్లాడ: మండలంలోని లక్ష్మీనగర్ వద్ద ఓ మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు బంగారు గొలుసు లాక్కెళ్లారు. లక్ష్మీనగర్‌కు చెందిన పూల లక్ష్మనరసమ్మ పశువులను మేపేందుకు ఆదివారం సమీపంలోని పొలాలకు వెళ్లింది. కొత్తగూడెం రోడ్డు వద్ద మోటార్ సైకిల్ ఆపిన ఇద్దరు వ్యక్తులు ఆమె మెడలోని బంగారు తాడు లాగారు. అయితే, ఆమె గట్టిగా పట్టుకోగా వారు బలవంతంగా గుంజడంతో మెడ వద్ద గాటు పడడంతో తాడు తెగడంతో లాక్కెళ్లారు. ఘటనపై బాధితురాలు చేసిన ఫిర్యాదుతో పోలీసులు విచారణ చేపట్టారు.

పశువుల వ్యాధులపై అవగాహన

వైరా: పాడి పశువులకు వచ్చే వ్యాధుల విషయంలో రైతులు అవగాహన కలిగి ఉండాలని పీ.వీ.నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం సంచాలకుడు డాక్టర్ బి.ఏకాంబరం సూచించారు. వైరా మున్సిపాలిటీ పరిధి 17వ వార్డులో సోమవారం విశ్వవిద్యాలయం, వరంగల్ మామునూరు పశువైద్య కళాశాల ఆధ్వర్యాన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా పశువులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశాక పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఖమ్మం పశువైద్య సంచాలకుడు డాక్టర్ వేణుమనోహర్, డీఎల్‌డీఓ చైర్మన్ కె.నాగేశ్వరరావుతో పాటు నాగేశ్వరరావు, డాక్టర్ జి.పురుషోత్తం, డాక్టర్ కిషోర్‌గౌడ్, బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రూ.1.25 లక్షల విలువైన పురుగు మందులు స్వాధీనం

తల్లాడ: మండలంలోని మల్లవరంలో సోమవారం టాస్క్‌ఫోర్స్ బృందం అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా నీలం తిరుపతిరావు ఇంట్లో రూ.1.25 లక్షల విలువైన కలుపు మందులు, బయో మందులను స్వాధీనం చేసుకున్నారు. అయితే, ఈ మందులను తమ బంధువుల కోసం తెచ్చినట్లు చెప్పిన ఆయన సరైన ఆధారాలు సమర్పించలేదు. అంతేకాక లైసెన్స్ కూడా లేకపోవడంతో తిరుపతిరావును అదుపులోకి తీసుకుని పురుగు మందుల చట్టప్రకారం కేసు నమోదు చేసినట్లు ఏఓ ఎం.డీ.తాజుద్దీన్ తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

'డయాలసిస్' నిర్వాహకులకు నోటీసులు

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలోని డయాలసిస్ సెంటర్‌లో ఎయిడ్స్ బాధితులకు డయాలసిస్ నిరాకరిస్తుండడంపై ఆరోగ్యశ్రీ ట్రస్ట్ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎయిడ్స్ బాధితులకు డయాలసిస్ ఎందుకు చేయడం లేదో వివరణ ఇవ్వాలని ఉమ్మడి జిల్లా ఆరోగ్యశ్రీ ట్రస్ట్ మేనేజర్ పర్వతపు శ్రీనివాస్ సెంటర్ నిర్వాహకులకు సోమవారం నోటీసులు అందజేశారు. ఎయిడ్స్ బాధితులకు డయాలసిస్ నిరాకరిస్తున్న విషయమై 'సాక్షి'లో సోమవారం 'అటు వ్యాధి... ఇటు వేదన' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు నోటీసులు జారీ చేసి వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో 'దీప్‌చంద్' సంస్థ డయాలసిస్ సేవలందిస్తుండగా, బిల్లులు ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చెల్లిస్తుంది. మిగతా చోట్ల ఎయిడ్స్ బాధితులకు కూడా డయాలసిస్ చేస్తున్నా ఖమ్మంలో ఎందుకు చేయడం లేదో చెప్పాలని నోటీసులో ప్రశ్నించారు. ఈవిషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు, ఆర్ఎంఓ బి.శ్రీనివాసరావు కూడా సీరియస్ అయ్యారు. కాగా, సెంటర్ నిర్వాహకులు మాత్రం ఒప్పందంలో ఎయిడ్స్ బాధితులకు అనుమతి ఇవ్వలేదని.. యాజమాన్యం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని చెబుతున్నారు.

ఆగస్టు 15

ఆమె... దేశంలో సగం ఎప్పుడు!?

స్వాతంత్ర్య దినోత్సవం దేశ ఔన్నత్యాన్ని మాట్లాడుతుంది. దేశ ఉజ్వల భవిష్యత్తును కాంక్షిస్తుంది. కాని దేశంలో సగమైన స్త్రీలు సంపూర్ణ స్వాతంత్ర్య ఫలాలు ఇంకా పొందవలసే వుంది. ఏనాడైతే స్త్రీల పట్ల సురక్షితమైన, సంస్కారవంతమైన ప్రవర్తనను ఈ సమాజం చూపుతుందో అప్పుడే స్త్రీలకు సంపూర్ణ స్వాతంత్ర్యం వచ్చినట్టు. అప్పుడే దేశ ఔన్నత్యం ఇనుమడించినట్టు. 'ఆకాశంలో సగం'లాగా దేశంలో సగం ఇంకెప్పుడు?



నేడు ఆగస్టు 15న ఎర్రకోట మీద జెండా ఎగురవేసే సమయంలో ప్రధాని నరేంద్ర మోడీకి ఇద్దరు మహిళా ఆర్మీ ఆఫీసర్లు సహకారం అందిస్తారు. మేజర్ నికితా నాయర్, మేజర్ జాస్మిన్ కౌర్ పతాకావిష్కరణ సమయంలో ప్రధానితో పాటుగా ఉండి జెండా వందనం సమర్పిస్తారు. ఈ విశేష ఘట్టంలో ఇద్దరు మహిళలకు ఈ విధంగా చోటు దక్కడం సంతోషపడాల్సిన సంగతి. 76 ఏళ్ల క్రితం స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు స్త్రీల స్థితిగతుల్లో వచ్చిన పురోభివృద్ధికి ఇదీ ఒక సంకేతమే. నాటి నుంచి నేటి వరకు విద్య, ఉపాధి, ఉద్యోగం, సైన్యం, పాలనా యంత్రాంగం, శాసన వ్యవస్థ... వీటిల్లో స్త్రీలకు గణనీయంగా స్థానం దక్కింది. ప్రాముఖ్యం లభించింది. అయితే అంతమాత్రాన స్త్రీలు సంపూర్ణంగా స్వాతంత్ర్య ఫలాలు అనుభవిస్తున్నారా అనేది ప్రశ్న.

స్త్రీల త్యాగం

దాస్య భారతంలో జరిగిన స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో స్త్రీలు పాల్గొన్నారు. అన్నింటికి మించి పురుషులు దేశం కోసం ప్రాణాలు అర్పించినా, జైళ్ల పాలైనా స్త్రీలు ధైర్యంగా ఇళ్లు నడిపి కష్టాలను ఈదారు. దేశ విభజన సమయంలో తీవ్ర హింసను ఎదుర్కొన్నారు. అంతెందుకు 1930 నాటికి దేశ వ్యాప్తంగా 30 వేల మంది స్త్రీలు స్వాతంత్ర్య పోరాటంలో ఏదో విధాన జైలు శిక్ష అనుభవిస్తున్నారని తెలిస్తే ఆశ్చర్యం వేస్తుంది. ఈ స్త్రీల పోరాటం చాలామటుకు చరిత్రలో నమోదు కాకుండానే కాలగర్భంలో కలిసిపోయింది. ఇప్పుడిప్పుడే నాటి వీర వనితల గాధలు వెలికి వస్తున్నాయి. ఇంత పోరాటం, త్యాగం చేసి స్త్రీల భాగస్వామ్యంతో తెచ్చుకున్న స్వాతంత్ర్యంలో స్త్రీలు నిజంగా సంతోషంగా ఉన్నారా?

సురక్షితం కాని దేశం

'ఒక స్త్రీ అర్ధరాత్రి క్షేమంగా నడిచి వెళ్లినప్పుడే ఈ దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్టు' అని గాంధీజీ ఏ ముహూర్తంలో అన్నారో కాని అలాంటి స్థితి నేటికీ రాకపోగా నానాటికీ తీసికట్టుగా తయారవుతోంది. ఎన్ని చట్టాలు చేసినా, శిక్షలు తెచ్చినా స్త్రీలను గౌరవించాలి, వారి ఆత్మగౌరవాన్ని కాపాడాలి అని మెజారిటీ సమాజం అనుకోవడం లేదు. 'నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి' అనే భావన సమాజంలో ఆది కాలం నుంచి చొప్పించి ఉండటం వల్ల స్త్రీ చేసే ప్రతి పనిలో తప్పు ఎంచడం, అదుపు చేయడం, చులకనగా చూడటం, వివక్ష చూపడం, దండించడం ఆనవాయితీగా మారింది. పిల్లల పెంపకం దశ నుంచే స్త్రీలను గౌరవించడం నేర్పించడం లేదు. ఇంట్లో అమ్మాయిని ఒకలాగా, అబ్బాయిని ఒకలాగా పెంచడం వల్ల ఈ అబ్బాయిలు 'సమాజం'గా మారి స్త్రీ పాలిట బెడదగా మారుతున్నారు. తమ మాటకు ఎటువంటి తిరస్కారం చెప్పినా పురుషుడు శిక్షించేవాడై స్త్రీని చంపేందుకు వెనుకాడటం లేదు. స్త్రీకి ఒక అభిప్రాయం కలిగి ఉండే స్వాతంత్ర్యం ఆమెకు ఎందుకు ఇవ్వడం లేదు?

స్త్రీలను ప్రేమ, మర్యాద, గౌరవాలతో కుటుంబం చూసుకోవాలి. అప్పుడు ఆ మర్యాద, గౌరవాలు సమాజంలోకి ఆటోమేటిక్‌గా వస్తాయి. కుటుంబం స్త్రీకి ఎలా రక్షణ ఇస్తుందో సమాజం కూడా స్త్రీకి అలా రక్షణ ఇవ్వాలనే పౌర శిక్షణ, సంస్కారం అవసరం. పురుషులు మాత్రమే కాదు స్త్రీలు కూడా కుటుంబం, సమాజం, దేశం కోసం గొప్పగా ఆలోచించగలరు. వారికి స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఇచ్చి చూస్తే తెలుస్తుంది. అటువంటి వేకువలోకి దేశం ఉదయించాలని ఈ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కోరుకుందాం.



● ఫ్రీడమ్ ఫిల్లింగ్ స్టేషన్, శిక్ష(ణ)లో ఉన్న మహిళలే నిర్వాహకులు

77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా...
ఆల్ ఉమెన్ పెట్రోల్ బంక్

కారాగారంలో గడిపే సమయం శిక్ష సమయం కాదు, శిక్షణ సమయం. కారాగారం మానసిక పరివర్తన దిశగా శిక్షణ ఇచ్చే ప్రదేశం. శిక్ష పూర్తయి విడుదలైన తర్వాత సమాజంలో గౌరవంగా జీవించడానికి అవసరమైన నైపుణ్య శిక్షణ కూడా ఇచ్చే ప్రదేశంగా ఉండాలి. అలాగే ఉంటాయి కూడా. అయితే ఈ ఏడాది దేశం మరో అడుగు ముందుకేసింది. శిక్ష అనుభవిస్తున్న మహిళలకు ఉపాధి అవకాశాలను జైలు గోడల మధ్య కాకుండా సమాజంలో కల్పించడం ఈ స్వాతంత్ర్య దినోత్సవం ప్రత్యేకత.

చెన్నై నగర శివారులో అంబత్తూరు– పుఴల్ రోడ్డులో ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు 'ఆల్ ఉమెన్ పెట్రోల్ బంక్' అనే ప్రయోగాత్మకమైన సంస్కరణకు వేదికైంది. పుఴల్ మహిళల కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న మహిళల్లో ముప్పై మందికి ఉద్యోగం ఇచ్చింది. దేశంలో ఇదే మొదటి ప్రయత్నం. ఈ ప్రయత్నంతో ఈ పెట్రోల్ బంకు ఫ్రీడమ్ ఫిల్లింగ్ స్టేషన్ అనే గౌరవ సూచికకు అర్హత సాధించింది. ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పన్నెండు గంటలు మహిళలు విధులు నిర్వర్తిస్తారు. ఆ తర్వాత పురుష ఖైదీలు విధుల్లోకి వస్తారు.

ఖైదీలు తమ శిక్ష కాలం పూర్తయిన తర్వాత సమాజంలో గౌరవంగా జీవించడం కోసం రకరకాల వృత్తుల్లో శిక్షణ ఇస్తారు. అవన్నీ జైలు గోడల మధ్యనే ఉంటాయి. మారుతున్న సమాజానికి తగినట్లు కొత్త కొత్త ఉపాధి మార్గాలకు తగిన ఏర్పాట్లు ఉండవు. అందుబాటులో ఉన్న పనుల్లోనే శిక్షణ ఇవ్వడమే జరిగేది. ఇదిలా ఉంటే... జైళ్లలో మహిళా ఖైదీలకు తగిన సౌకర్యాల పర్యవేక్షణ కోసం అన్ని రాష్ట్రాల్లో పర్యటించిన మహిళా కమిషన్ సభ్యుల పరిశీలనలో కొత్త విషయాలు తెలిశాయి. జైలు గోడల మధ్య ఉండడం వల్ల మహిళలు మానసికంగా కుంగుబాటుకు లోనవుతున్నారని, వారికి సమాజంలో భాగస్వామ్యం కల్పించాలని సూచించడంతో, ఆ సూచనను అందుకున్న జైలు అధికారుల్లో మొదటగా పుఴల్ జైలు అధికారులు ఈ ప్రయత్నం చేశారు. మహిళలకు పెట్రోల్ పట్టడంలో శిక్షణ ఇవ్వడంతోపాటు వినియోగదారులతో మాట్లాడడం, ఉద్యోగానికి తగిన ప్రవర్తనా నియమావళిలో కూడా మహిళలకు శిక్షణ ఇప్పించారు.

పెట్రోల్ బంకులో విధులు నిర్వర్తిస్తున్న మహిళలు తమకు స్వాతంత్ర్యం వచ్చినట్లు సంతోషిస్తున్నారు. శిక్ష కాలాన్ని ఆనందంగా పూర్తి చేస్తామని, పరిపూర్ణమైన వ్యక్తిత్వంతో సమాజంలోకి విడుదలవుతామని చెప్పారు.

శిక్ష కాలం సమాజంలోనే!

శిక్షణ కాలంలో మారుతున్న కాలానికి అనుగుణంగా సంస్కరణలు తీసుకురావడంతోపాటు ఖైదీలను సమాజంతో అనుసంధానం చేయడం, వారి పునరావాసం కోసం పని చేయడం కూడా అవసరమే. ఆ అవసరాన్ని గుర్తించి మహిళలతోనే ముందడుగు వేసింది జైళ్ల శాఖ. శిక్ష సమయంలో కూడా సమాజంలో మనుషులతో మాట్లాడుతూ ఉంటే మానసికంగా ఆరోగ్యంగా ఉంటారు. సమాజానికి దూరంగా ఉన్నామనే ఆవేదన దూరమవుతుంది. సమాజంలోనే నివసిస్తున్న భావనతో జీవిస్తారు.

స్వాతంత్ర్యాన్ని ఇలా ఎంజాయ్ చేయండి!

నేటి టెక్నాలజీ యుగంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని హాలిడేగా తీసుకుని ఆనందించే వారే ఎక్కువ. స్కూలు, కాలేజీ విద్యార్థులైతే జెండా వందనం తరువాత ఇంటికెళ్లిపోవచ్చు అని తెగ సంబరపడిపోతుంటారు. కానీ డెబ్బై ఆరేళ్లుగా విరామం లేకుండ జరుపుకొంటూ నేడు 77వ వసంతంలో అడుగు పెట్టాం. దేశాన్ని పాలించే అధికారులు అధికారికంగా ఈ వేడుకలు జరిపిస్తున్నారు. బాధ్యత గల పౌరులుగా మనం ఇలా సెలబ్రేట్ చేసుకుందాం....



● ఉదయాన్నే ఎర్రకోటపై జరిగే జెండావందనం, వివిధ కార్యక్రమాలను టీవీలో చూడాలి. డెబ్బై ఏడేళ్ల స్వాతంత్ర్య భారతం ఎంత ఎత్తుకు ఎదిగిందన్న అంశాలను ప్రత్యక్ష ప్రసారాలు చూడడం ద్వారా తెలుసుకోవచ్చు ● తరువాత ఎప్పటి నుంచో అనుకుంటున్న ప్లేసుకి ఈరోజు వెళ్లండి. ఒక రోజులో వెళ్లిరాగల ప్రాంతానికి వెళ్లి అక్కడ గడిపి మీ ఒత్తిడిని దూరం చేసుకోండి. అక్కడ స్వతంత్ర దినోత్సవాన్ని గుర్తుండిపోయేలా గడపండి. ● రోజూ వేసుకునే దుస్తులు కాకుండా భారతీయ సంప్రదాయం ఉట్టిపడేలాంటి దుస్తులు ధరించండి. వీలైనంత వరకు డ్రెస్‌లో తెలుపు, కాషాయం, ఆకుపచ్చని రంగులు ఉండేలా చూసుకుని వేసుకోవాలి. అప్పుడు త్రివర్ణ పతాకానికి మరింత వన్నె తెచ్చిన వారవుతారు ● ఎక్కడికీ వెళ్లే ఓపిక లేనప్పుడు ఇంట్లోనే ఉండి దేశభక్తి సినిమాలు చూడండి. మీతోపాటు మీ పిల్లలకు మన దేశ చరిత్ర, ఔన్నత్యాలు తెలుస్తాయి ● మరింత ఉత్సాహంగా సెలబ్రేట్ చేసుకోవాలంటే మూడు రంగులు ఉండేలా వెరైటీ డిష్‌లు తయారు చేసుకుని తినండి ● స్వాతంత్ర్య దినోత్సవం అర్థం ఉట్టిపడేలా గాలిపటాలు ఎగరవేయండి. మూడు రంగుల్లో ఉన్న గాలిపటాలను వీలైనంత ఎత్తుకుఎగరేస్తూ మనకొచ్చిన స్వేచ్ఛను ఎంజాయ్ చేయవచ్చు ● పుస్తకాల పురుగులు అయితే దేశభక్తి పుస్తకాలను చదవండి. స్వాతంత్ర్య సమర యోధుల విజయగాథలు, వీరిలో బాగా పాపులర్ అయిన నాయకుల బయోగ్రఫీని చదివి ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు ● దేశభక్తి గీతాలు వింటూ కూడా సంబరాలు జరుపుకోవచ్చు. అలనాటి పోరాట, అసామాన్య త్యాగాలను గుర్తుచేసే పాటలను వినాలి. లతా మంగేష్కర్, మహ్మద్ రఫీ, ఏఆర్ రెహ్మాన్ పాటలు మనలో నిద్రపోతున్న దేశభక్తిని తట్టి లేపుతాయి ● ఇంటి చుట్టుపక్కల వారు లేదా బంధువులు, కుటుంబ సభ్యులతో దగ్గరలో జరుగుతోన్న జెండా పండుగకు వెళ్లి రెపరెపలాడే త్రివర్ణ పతాకానికి జైహింద్ కొట్టాలి ● దేశానికి పెద్ద సేవ చేయలేక పోయినప్పటికీ మీ చుట్టుపక్కల ఉన్న వారందరికి స్వీట్లు పంచి, నోరు తీపి చేస్తూ స్వతంత్ర దినోత్సవ వేడుకలు జరుపుకోండి.

ప్రతి భారతీయుడికి ఎంతో విలువైన బహుమతులు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు. అందుకే వీలైనంత వరకు అందరితో కలిసి జరుపుకోవాల్సిన జెండా పండుగ ఇది. సెలవు దొరికింది అని సంబరపడిపోక వీటిలో ఏ ఒక్కదాన్ని పాటించినా స్వాతంత్ర్య దినోత్సవాన్ని గౌరవించినట్లే.

జీవన సేద్యం!

● పెద్ద కమతాల్లో సేంద్రియ వరి సేద్యంలో జీవన ఎరువులు/పురుగుమందులు కీలకం



● వ్యవసాయ క్షేత్రంలో సిద్ధమవుతున్న జీవన ఎరువులు

సాగుబడి
అశ్లేష కార్తె: ఆగస్టు 17 వరకు
మఖ: 18 నుంచి

సేంద్రియ/ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ద్రావణాలు, కషాయాలను చిన్న, సన్నకారు రైతులు తయారు చేసుకొని వాడగలుగుతున్నారు. అయితే, ఎక్కువ విస్తీర్ణంలో సేంద్రియ/ప్రకృతి సేద్యం చేసే పెద్ద రైతులకు వీటి తయారీ కష్టం కావటంతో జీవన ఎరువులు, జీవన పురుగుమందులను విరివిగా వినియోగిస్తున్నారు. రైతు శాస్త్రవేత్త, తునికిలోని ఏకలవ్య కేవీకే సలహాదారు, హార్ట్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఎం.ఎస్.సుబ్రహ్మణ్యం రాజు గత కొన్ని సంవత్సరాలుగా చిన్న, పెద్ద కమతాల్లో సాగు చేసే రైతులతో కలిసి పనిచేస్తున్నారు. ఖరీఫ్/లేటు ఖరీఫ్ వరి సాగులో చిన్న కమతాల రైతులు, పెద్ద కమతాల రైతులు ఏయే ఉత్పాదకాలను, ఎంతెంత మోతాదులో వాడితే మంచి ఫలితాలు వస్తున్నాయన్న అంశాలను ఆయన 'సాక్షి సాగుబడి'కి ఇలా వివరించారు.

వరి నారుమడిని నీరు నిలవని విధంగా తయారు చేసుకోవాలి. విత్తనాన్ని ఒక రోజు ముందు ఎండబెట్టి మరునాడు విత్తన శుద్ధి చేయాలి. నిద్రావస్థ ఉన్న విత్తనాలను, నిద్రావస్థ తొలగించడానికి గోరువెచ్చని నీటిలో నానబెట్టి, అనంతరం విత్తనాలను నారుమడిపై వెదజల్లాలి. 2వ రోజు నీరు బయటకు తీయాలి. 5వ రోజు నీరు పెట్టాలి. తర్వాత తగినంత నీరు ఇస్తుండాలి. చాలా ప్రాంతాల్లో నారు 6 అంగుళాల సైజు నుంచి 10 అంగుళాల సైజు వచ్చినప్పుడు మాత్రమే ఊడ్పు/నాట్లు వేస్తుంటారు. నాట్లు వేసిన 7 రోజులకు.. చనిపోయిన మొక్కల స్థానంలో మళ్లీ నాట్లు వేయాలి.

ప్రధాన పొలాన్ని ఊడ్పుకు ముందు 20 రోజుల నుంచి దఫ దఫాలుగా వారానికి ఒకసారి దుక్కి దున్ని, చదును చేసుకోవాలి. ఎకరాకు 3 నుంచి 5 టన్నుల పశువుల ఎరువు వెయ్యాలి. నాట్లతో పాటుగా వివిధ రకాల జీవన ఎరువుల (బ్యాక్టీరియాల)ను ఇవ్వాలి. మొక్కల మధ్య 20 సెం.మీ. దూరం ఉండేలా వరి నాట్లు వేయాలి. మధ్యలో కాలి బాటలు తీయాలి. గట్లపై నువ్వుల విత్తనాలను చల్లుకుంటే నువ్వుల పువ్వులు ఎనాగరస్ అనే కీటకాన్ని ఆకర్షించటం ద్వారా తెల్లదోమ నివారణ జరుగుతుంది.

సేంద్రియ వరి సాగులో చిన్న, పెద్ద రైతులకు అనువైన ఉత్పాదకాల పట్టిక

వివరణ	చిన్న రైతులకు అనువైన ప్రాచీన పద్ధతులు	పెద్ద రైతులకు అనువైన ఆధునిక పద్ధతులు
1వ రోజు విత్తనశుద్ధి	బీజామృతంతో విత్తన శుద్ధి చేయాలి	హ్యూమిక్ యాసిడ్, బవేరియా, మెటారైజియం, సూడోమోనాస్
10వ రోజు పిచికారీ	జీవామృతం + పంచగవ్య + పుల్ల మజ్జిగ	మీనామృతం + సూడోమోనాస్+ తౌడు కషాయం
12వ రోజు ఎరువు	ఘనజీవామృతం	ఘనజీవామృతం / వర్మీకంపోస్టు + హ్యూమిక్ ఆసిడ్
20వ రోజు సస్యరక్షణ	ఆగ్నేయ అస్త్రం + జీవామృతం + మొలకల ద్రావణం	మీనామృతం + బేవేరియా, మెటారైజియం + వెర్టిసీలియం పిచికారీ చేయాలి.
ఊడ్పు అనంతరం 22వ రోజు స్ప్రే	పంచగవ్య + అగ్ని అస్త్రం + పుల్ల మజ్జిగ	మీనామృతం+బవేరియా +మెటారైజియం+ వెర్టిసీలియం + కొబ్బరి నీరు పిచికారీ చేయాలి. కాండం తొలిచే పురుగుకు ల్యూర్ పెట్టాలి లేదా ట్రైకోగ్రామా కార్డులు పెట్టాలి లేదా తూజా 200 (హోమియో) పిచికారీ చేయాలి.
25వ రోజు ఊడ్పు	ఘనజీవామృతం 1 టన్ను / 1 ఎకరం + వేప పిండి 200 కిలోలు/ఎకరం	ఘనజీవామృతం 1 టన్ను/ 1ఎ + బ్యాక్టీరియాలు, ఎన్‌పికె, బవేరియా, మెటారైజియం బాక్టీరియాలు.
25 రోజులకు	కలుపు తీయాలి.	కలుపు తీయాలి.
35 రోజులకు	మొలకల ద్రావణం + ఆగ్నేయ అస్త్రం + ఇంగువ కషాయం లేదా పుల్ల మజ్జిగ పిచికారీ చేయాలి.	మీనామృతం, సోయాబీన్, పెసలు మొలకల ద్రావణం, సూడోమోనాస్, బవేరియా, మెటారైజియం, వెర్టిసీలియం పిచికారీ చేయాలి.
40 రోజులకు	కలుపు తీయాలి.	కలుపు తీయాలి.
45 రోజులకు	మొలకల ద్రావణం + వేప గింజల కషాయం	మీనామృతం + నేల వేము కషాయం + ఉలవల కషాయం
45 రోజులకు	ఘనజీవామృతం 500 కిలోలు/1 ఎకరం	ఘనజీవామృతం 500 కిలోలు / 1 ఎకరం
65వ రోజు పిచికారి	మొలకల ద్రావణం + ఇంగువ కషాయం + పసుపు దుంపల కషాయం + ఆగ్నేయ అస్త్రం	మీనామృతం + సూడోమోనాస్ + వెర్టిసీలియం + వావిలాకు కషాయం
80వ రోజు పిచికారీ	మొలకల ద్రావణం + పుల్ల మజ్జిగ + దశపర్ణి కషాయం	మీనామృతం + సూడోమోనాస్ + వెర్టిసీలియం + బవేరియా



● జీవామృతం

మోతాదు ఎంత?

● ఎకరం పంటకు సగటున 100–120 లీ. నీటిని పిచికారీ చేయాలి ● మీనామృతాన్ని నారుమడిపై లీ. నీటికి 5 ఎం.ఎల్., పైరు ఎదిగిన దశలో లీ. నీటికి / 10ఎం.ఎల్. చొప్పున కలిపి పిచికారీ చేయాలి ● బవేరియాను లీ. నీటికి /10 గ్రా. కలిపి పిచికారీ చేయాలి ● మెటారైజమ్ లీ. నీటికి/10 గ్రా. వాడాలి ● హ్యూమిక్ యాసిడ్ కిలో విత్తనాలకు/10 గ్రా. వాడాలి. ● కిలో నేల వేము పొడిని 100 లీ. నీటిలో కలిపి కషాయం తయారు చేయాలి ● 1500 గ్రా. వావిలాకు పొడిని కషాయం చేసుకొని 100 లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి ● ఎకరానికి రకానికి ఒక కిలో చొప్పున జీవన ఎరువులు వాడాలి ● లీ. నీటికి 10 ఎం.ఎల్. కొబ్బరి నీరు కలపాలి ● పంచగవ్య నారుమడిలో పిచికారీకి లీ. నీటికి 5 ఎం.ఎల్. కలపాలి. పైరు ఎదిగే దశలో పిచికారీకి లీ. నీటికి 20 ఎం.ఎల్. కలపాలి ● అర కేజీ ఇంగువతో ద్రావణం చేసుకొని వంద లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి ● 200 గ్రా. పసుపును కషాయం చేసుకొని వంద లీ. నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలి ● 2 కిలోల మొలకలతో ద్రావణం చేసుకొని వంద లీ. నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలి ● 6 లీ. పుల్ల మజ్జిగను వంద లీ. నీటితో కలిపి పిచికారీ చేయాలి. ● ఆగ్నేయ అస్త్రం తయారీలో మిర్చి, అల్లం, వెల్లుల్లిలను అర కిలో చొప్పున తీసుకొని నూరి కషాయం తయారు చేసి వంద లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
(ఇతర వివరాలకు.. సుబ్రహ్మణ్యం రాజు మొబైల్: 76598 55588)

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్



● థార్ ఎడారిలో సాగవుతున్న మొలకగడ్డి

ఎడారిలో ఆశల మొలక

ప్రపంచంలోనే అత్యధిక పాలను ఉత్పత్తి చేస్తున్న మన దేశంలో పచ్చిగడ్డి లభ్యత 11 శాతం తక్కువగా ఉందని భారతీయ గడ్డి నేలలు, పశుగ్రాస పరిశోధనా సంస్థ లెక్కగట్టింది. భూతాపం ప్రమాదకరమైన రీతిలో పెరుగుతున్న ప్రస్తుత కాలంలో పచ్చిగడ్డి సాగుకు హైడ్రోపోనిక్స్ పద్ధతి చక్కని ప్రత్యామ్నాయంగా మారుతోంది. ఈ పద్ధతిలో తక్కువ స్థలంలో, పది శాతం నీటితోనే ఏడాది పొడవునా మొలక గడ్డిని పెంచుకోవచ్చు. మొలక గడ్డిని పాడి ఆవులు, గొర్రెలు, మేకలకు మేపటం మన రాష్ట్రాల్లోనే కాదు.. రాజస్థాన్‌లోని థార్ ఎడారి ప్రాంత పశుపోషకులను సైతం ఆకర్షిస్తోంది. అక్కడ ఏడాదిలో రెండు నెలలే వర్షం పడుతుంది. మండు వేసవిలో ఎండ వేడి 120 డిగ్రీల సెల్షియస్‌కు చేరుతుంటుంది. అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో జీవించే థార్ ప్రాంత రైతులు, సంచార పశుపోషకులు స్వచ్ఛంద సంస్థలు, స్టార్టప్‌ల తోడ్పాటుతో ఇటీవల హైడ్రోపోనిక్ మొలక గడ్డి సాగు చేపట్టారు. సునాయాసంగా నాణ్యమైన పాల దిగుబడితో పాటు ఆదాయాన్ని పెంచుకుంటున్నారు.



● మొలకగడ్డి వేస్తున్న మహిళారైతు పలు హేమారామ్

స్వచ్ఛంద సంస్థలు, స్టార్టప్‌లు ఎడారి ప్రాంత రైతులు, పశుపోషకుల కోసం హైడ్రోపోనిక్ మొలక గడ్డిని పెంచే షెడ్లను నెలకొల్పుతున్నాయి. రైతులే వాటిలో మొక్కజొన్నలు, గోధుమలను నానబెట్టి, వర్టికల్ గార్డెన్ మాదిరిగా అనేక దొంతర్లలో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ ట్రేలలో మొలక గడ్డిని పెంచుతున్నారు. సాధారణంగా పొలంలో పచ్చిగడ్డిని పెంచడానికి 2 నెలలు పడుతుంది. మొలక గడ్డి 8 రోజుల్లో పెరుగుతుంది. ముఖ్యంగా పది శాతం నీటితోనే ఈ గడ్డి పెరగటం థార్ ఎడారి ప్రాంత రైతులు, పశుపోషకులకు ఉపయుక్తంగా మారింది.

స్వచ్ఛంద సంస్థ ఉర్ముల్ సీమంత్ సమితి, డిజర్ట్ రిసోర్స్ సెంటర్‌తో కలసి హైడ్రోగ్రీన్స్, బహుళ నేచురల్స్ స్టార్టప్‌లు మొలక గడ్డి ఉత్పత్తి యూనిట్లను థార్ ఎడారి గ్రామాల్లో ఏర్పాటు చేస్తుండటంతో కొందరు మహిళా రైతులు హాయిగా ఊపిరిపీల్చుకుంటున్నారు. బహుళ నేచురల్స్ వీరి వద్ద నుంచి దేశీ ఆవు పాలను, ఒంటె పాలను సేకరించి, విలువ జోడించి ఆన్‌లైన్‌లో విక్రయిస్తోంది. వెయ్యి మంది పాడి రైతులు, 4 వేల మంది పశుపోషకులు తమ ఆవులు, మేకలకు మొలక గడ్డిని మేపుకుంటూ ఏడాది పొడవునా స్థిరమైన ఆదాయం పొందుతున్నారు.

పశుపోషణ కోసం గొడ్డు చాకిరీ చేసే మహిళా రైతులకు మొలక గడ్డి అందుబాటులోకి రావటం గొప్ప ఊరటనిస్తోంది. మొలక గడ్డి మేపుతో దేశీ ఆవు పాల దిగుబడి మూడింట ఒక వంతు పెరగడంతో పాటు, నాణ్యత కూడా పెరిగిందని రాజస్థాన్‌లోని ఘంటియాలి గ్రామానికి చెందిన దళిత మహిళా పశుపోషకురాలు 'పలు', ఆమె భర్త హేమారామ్ సంతోషంగా చెబుతున్నారు. వీరికి 8 ఆవులు, మేకలు ఉన్నాయి. 4 మైళ్ల దూరంలో ఉన్న పొలానికి వెళ్లి గడ్డి కోసుకొని, ఎండలో నెత్తిన పెట్టుకొని మోసుకు రావటం ఆమెకు కనాకష్టంగా ఉండేది. రెండేళ్ల క్రితం ఇంటి పక్కనే మొలకగడ్డి ఉత్పత్తి యూనిట్‌ను ఏర్పాటు చేసుకున్నాక ఆ బాధ తప్పింది. మిగులు గడ్డిని, గోధుమ గడ్డి పొడిని అమ్ముతూ ఆదాయం పొందుతుండటం విశేషం.

దూడలకు పెట్టే కాన్సంట్రేట్ మిక్చర్ దాణాను 75% తగ్గించి మొక్కజొన్న మొలక గడ్డిని మేపటం వల్ల మంచి ఫలితం కనిపించిందని బికనెర్ వెటరినరీ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.కె. ధురియా అన్నారు. హైడ్రోపోనిక్ మొలక గడ్డి వల్ల మేకల్లో జీర్ణశక్తి, పెరుగుదల బాగుందని సౌదీ అరేబియాలోని కింగ్ సౌద్ యూనివర్సిటీ అధ్యయనంలో వెల్లడైంది. మొలకగడ్డి యూనిట్ ఏర్పాటుకు రూ. 18 లక్షల నుంచి 25 లక్షల వరకు ఖర్చవుతోంది. అయితే, ఇసుక తుపాన్లకు మొలకగడ్డి షెడ్లు దెబ్బతినటం వల్ల నష్టం జరుగుతోంది.

అందుకని, ముమ్ముందు షిప్పింగ్ కంటెయినర్లలో మొలకగడ్డి ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేయటమే దీనికి పరిష్కారమని బహుళ నేచురల్స్ భావిస్తోంది. లక్షల ఖర్చుతో కూడిన పని కావటంతో రైతులను బృందాలుగా ఏర్పాటు చేసి మొలకగడ్డి యూనిట్లను నెలకొల్పితే మేలు. అయితే, రూ. 17.500 ఖర్చుతో చిన్నపాటి మొలకగడ్డి యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చని హైడ్రోగ్రీన్స్ స్టార్టప్ చెబుతోంది.

బయోచార్‌తో సేంద్రియ ఇంటిపంటల సాగుపై శిక్షణ

సేంద్రియ ఇంటిపంటల సాగుపై పట్టణ/నగర వాసులపై ఆసక్తి పెరుగుతోంది. బయోచార్ (బొగ్గుపొడి) కలిపిన మట్టి మిశ్రమంతో టెర్రస్ గార్డెన్లు, పెరటి తోటలు, బాల్కనీలలో కూరగాయల పెంపకంపై ఈ నెల 24, 25 తేదీల్లో హైదరాబాద్ మలకోపేటలోని న్యూలైఫ్ ఫౌండేషన్ శిక్షణ ఇవ్వనుంది. మిగులు పంట దిగుబడులను సోలార్ డ్రయ్యర్‌తో ఎండబెట్టే విధానం కూడా వివరిస్తామని న్యూలైఫ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శివ షిండే తెలిపారు. వివరాలకు.. 81210 08002.

17న అమలాపురంలో ప్రకృతి సేద్యంపై శిక్షణ

శ్రీనివాస సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 17న కోనసీమ జిల్లా అమలాపురంలోని (ముక్తేశ్వరం– కొత్తపేట రోడ్డు) శ్రీసత్యనారాయణ గార్డెన్స్‌లో ప్రకృతి వ్యవసాయంపై నిపుణులు విజయరామ్ రైతులకు అవగాహన కల్పిస్తారని నిర్వాహకులు నిమ్మకాయల సత్యనారాయణ తెలిపారు. ప్రవేశం ఉచితం. ముందుగా పేరు నమోదు చేసుకోవాలి. వివరాలకు.. 64091 11427 (సా. 3 గం. నుంచి 6 గం. వరకు మాత్రమే).

క్లుప్తంగా...

కృష్ణా జలాలపై నవంబర్ 29న విచారణ

సాక్షి, న్యూఢిల్లీ : కృష్ణా నదీ జలాల కేటాయింపులపై నవంబర్ 29 సుప్రీం కోర్టు విచారణ జరపనుంది. నదీ పరీవాహక ప్రాంతాలైన ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర మధ్య కృష్ణా ట్రిబ్యునల్ నీటి పంపకాలు జరుపుతూ 2010లో తుది అవార్డు జారీ చేసింది. దీనిని వ్యతిరేకిస్తూ కర్ణాటక సుప్రీం కోర్టులో అభ్యంతరం వ్యక్తం చేస్తూ అప్లికేషన్ దాఖలు చేసింది. ఈ విషయాన్ని జస్టిస్ సూర్యకాంత్ జస్టిస్ దీపాంకర్ దత్తలతో కూడిన ధర్మాసనం ముందు కర్ణాటక తరపు సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్ సోమవారం ప్రస్తావించారు. రూ.వేల కోట్లతో కర్ణాటక ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులు పూర్తిగా వచ్చాయని శ్యామ్ దివాన్ తెలిపారు. ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం రాష్ట్రానికి కేటాయించిన జలాల మేరకు విడుదల చేయాలన్నారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా విచారణ వేగవంతం చేయాలని, సముద్రంలోకి వృథాగా నీరు వెళ్లకుండా చూడాలని కోరారు. తొలుత నవంబర్ 21న విచారిస్తామన్న ధర్మాసనం తుది విచారణ నిమిత్తం నవంబర్ 29న విచారణ జాబితాలో చేర్చాలని రిజిస్ట్రార్‌ని ఆదేశించింది.

చెన్నై ఎక్స్‌ప్రెస్‌లో దోపిడీ

చార్మినర్ ఎక్స్‌ప్రెస్‌లోనూ దోపిడీకి యత్నం

ఉలవపాడు: అర్ధరాత్రి వేళ.. అందరూ నిద్రలో ఉన్నారు.. అంతలో ఒక్కసారిగా రైల్లో కలకలం.. బోగీలోకి ఎక్కిన దొంగలు ప్రయాణికులను బెదిరించి వారి వద్ద నుంచి బంగారు ఆభరణాలు తీసుకుని చైన్ లాగి దర్జాగా రైలు దిగి వెళ్లిపోయారు. చాగల్లు–తెట్టు మధ్య హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌లో ఆదివారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. హైదరాబాద్ నుంచి చెన్నైకు వెళ్తున్న హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ రాత్రి గం.1.50 సమయంలో నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం రాజుపాలెం (చాగల్లు–తెట్టు) వద్ద దొంగలు చైన్ లాగడంతో రైలు నిలిచింది. దొంగలు ప్రయాణికులను బెదిరించి వారి నుంచి నగలు అపహరించి రైలు దిగారు. అనంతరం హైదరాబాద్ నుంచి తాంబరం వెళుతున్న చార్మినార్ ఎక్స్‌ప్రెస్ 2.30గం.ల. సమయంలో సిగ్నల్ వద్ద నిలిచిపోయింది. అక్కడే ఉన్న దొంగలు అక్కడే ఉండి ప్రయాణికులను బెదిరించి దోపిడీ చేసేందుకు యత్నించారు. కానీ రైల్వే పోలీసులు టార్చ్‌లైట్లు వేసి వారిని చూడాలని ప్రయత్నించడంతో రైలుపై రాళ్లు రువ్వారు. దీంతో ఆటోలో దొంగలు పారిపోయారు. ఈ రెండు ఘటనలు 40 నిమిషాల వ్యవధిలో జరిగాయి. హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌లో మొత్తం మూడు బోగీలలో కలిపి 111 గ్రాముల బంగారం దోపిడీ జరిగినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

మారణహోమానికే టీడీపీ నేతల దాడి

ముందస్తు ప్రణాళికతోనే అంగళ్లు నుంచి పుంగనూరు వరకు విధ్వంసం

- ఓ మార్గంలో అనుమతి తీసుకుని చంద్రబాబు మరో మార్గంలో వచ్చారు
- చంద్రబాబు స్వయంగా వేసేయండిరా అంటూ కార్యకర్తలను రెచ్చగొట్టారు
- అడ్డుకొన్న పోలీసులపైనా దాడి చేశారు.. 47 మంది పోలీసులు గాయపడ్డారు
- ఈ ఘటనతో సంబంధం ఉన్న వారందరినీ అరెస్టు చేస్తాం
- ఇలాంటి ఘటనలను, బాధ్యులను కోర్టులు ఉపేక్షించకూడదు
- హైకోర్టుకు నివేదించిన అదనపు ఏజీ సుధాకర్‌రెడ్డి
- విచారణ బుధవారానికి వాయిదా
- అప్పటి వరకు పిటిషనర్లపై చర్యలు తీసుకోవద్దని ఏఏజీకి న్యాయమూర్తి మౌఖిక ఆదేశాలు



సాక్షి, అమరావతి : మారణహోమం సృష్టించాలన్న ముందస్తు పక్కా ప్రణాళికతోనే అన్నమయ్య జిల్లా అంగళ్లు వద్ద తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు దాడికి పాల్పడ్డారని పోలీసుల తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి హైకోర్టుకు నివేదించారు. అందులో భాగంగానే పోలీసులకు కూడా చెప్పకుండా టీడీపీ అధినేత చంద్రబాబు ప్రయాణ మార్గాన్ని కూడా మార్చారని వివరించారు. పోలీసుల నుంచి ఓ మార్గానికి అనుమతి తీసుకుని, మరో మార్గంలో రావడం వెనుక కుట్ర ఉందన్నారు. టీడీపీ అగ్ర నేతల ఆదేశాలతో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు అధికార పార్టీ కార్యకర్తలపై దాడులు చేశారని, అంగళ్లు నుంచి పుంగనూరు వరకు విధ్వంసం సృష్టించారని తెలిపారు. అడ్డుకోబోయిన పోలీసులపైనా విచక్షణారహితంగా దాడి చేశారన్నారు. టీడీపీ దాడిలో దాదాపు 47 మంది పోలీసులు గాయపడి చికిత్స పొందుతున్నారని, ఓ పోలీసు ఏకంగా కంటి చూపు కోల్పోయారని వివరించారు. అధికార పార్టీ కార్యకర్తలను చూడగానే ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు 'వాళ్లను తరమండిరా, వేసేయండిరా..'అంటూ టీడీపీ కార్యకర్తలను ఉసిగొల్పారన్నారు. ఆయన ఆదేశాలతోనే వారు విధ్వంసం సృష్టించారన్నారు. పోలీసులు రాకుండా ఉంటే వారి చేతిలో పలువురు చనిపోయి ఉండేవారని వివరించారు. కార్యకర్తలను రెచ్చగొట్టినందుకే చంద్రబాబు, ఇతర నేతలపై హత్యాయత్నం కేసు కూడా నమోదు చేశామన్నారు. 'యుద్ధభేరి'పేరుతో ప్రాజెక్టుల సందర్శన కోసం వచ్చి అంగళ్లు నుంచి పుంగనూరు వరకు యుద్ధ వాతావరణం సృష్టించారని, వారు చేయాలనుకున్నది చేసి చూపారని చెప్పారు. ఇలాంటి ఘటనలను, ఇందుకు బాధ్యులైన వారిని న్యాయస్థానాలు ఉపేక్షించకూడదని కోరారు. అంగళ్లు వద్ద టీడీపీ దాడులపై చంద్రబాబు సహా పలువురు టీడీపీ నేతలపై ముదివీడు పోలీసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో ముందస్తు బెయిల్ కోరుతూ టీడీపీ సీనియర్ నేతలు దేవినేని ఉమామహేశ్వరరావు, నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి, పులివర్తి నాని వేర్వేరుగా దాఖలు చేసిన వ్యాజ్యాలపై జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి సోమవారం విచారణ జరిపారు.

ఉపయోగపడే ప్రాజెక్టును అడ్డుకోవద్దని కోరితే చంపేస్తారా?

ఈ సందర్భంగా ఏఏజీ సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. పలు గ్రామాల ప్రజలకు అత్యంత ఉపయుక్తమైన పిచ్చివాండ్లపల్లి ప్రాజెక్టును అడ్డుకునేందుకు కొందరు టీడీపీ నేతలు హైకోర్టులో స్టే తెచ్చారని, దీనిపై నిరసన తెలిపి, చంద్రబాబుకు వినతిపత్రం ఇచ్చేందుకు స్థానిక అధికార పార్టీ నేతలు అంగళ్లు వద్ద శిబిరం ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. అక్కడి రాగానే అధికార పార్టీ నేతలను చూసిన చంద్రబాబు ఆగ్రహంతో ఊగిపోతూ, వారిని తరమండి, కొట్టండి, వేసేయండి అంటూ కార్యకర్తలను రెచ్చగొట్టారని వివరించారు. అక్కడి నుంచి విధ్వంసం మొదలైందన్నారు. మొదటి ముద్దాయి చంద్రబాబును ఎందుకు అరెస్ట్ చేయలేదని న్యాయమూర్తి ప్రశ్నించగా.. విధ్వంసంతో సంబంధం ఉన్న వారందరినీ అరెస్టు చేస్తామని సుధాకర్‌రెడ్డి చెప్పారు. పిటిషనర్ ఉమా సైతం అధికార పార్టీ నేతలను బెదిరించేలా వారి వైపు వేలు చూపుతూ వారిని కొట్టండంటూ టీడీపీ కార్యర్తలను రెచ్చగొట్టారన్నారు. ప్రతిపక్ష నేతలు వస్తున్నారని తెలిసీ, అధికార పార్టీ నేతలు అక్కడికి ఎందుకు వెళ్లారని న్యాయమూర్తి ప్రశ్నించగా.. ప్రజలకు ఉపయుక్తమైన ప్రాజెక్టును అడ్డుకోవద్దని విజ్ఞప్తి చేయడానికే వెళ్లారని, వినతి పత్రం ఇవ్వడానికి సిద్ధమైనంత మాత్రానా చంపేస్తారా అంటూ సుధాకర్‌రెడ్డి ప్రశ్నించారు.

రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే కేసు

అంతకు ముందు దేవినేని ఉమా తరఫు సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపిస్తూ, ఫిర్యాదుదారు ఉమాపతిరెడ్డికి ఎలాంటి గాయాలు కాలేదన్నారు. ఉమాపై ఎలాంటి ప్రత్యక్ష ఆరోపణలు లేవని, రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే కేసు నమోదు చేశారన్నారు. మరింత మంది నేతలను ఇరికించేందుకే కేసు నమోదులో జాప్యం చేశారన్నారు. నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి తరఫు న్యాయవాది ఎన్‌వీ సుమంత్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్‌పై ఎలాంటి ఆరోపణలు లేవని, ఉద్దేశపూర్వకంగానే కేసు నమోదు చేశారని అన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ సురేష్‌రెడ్డి ఏఏజీ అభ్యర్థన మేరకు విచారణను బుధవారానికి వాయిదా వేశారు. అప్పటి వరకు పిటిషనర్లను అరెస్ట్ చేయవద్దని, ఆ మేర పోలీసులకు సూచన చేయాలని సుధాకర్‌రెడ్డికి న్యాయమూర్తి మౌఖికంగా చెప్పారు.

కేసీఆర్ హటావో..తెలంగాణ బచావో..బీజేపీకి జితావో

- ఈనెల 16 నుంచి సెప్టెంబర్ వరకు మూడు విడతల్లో ఉద్యమ కార్యక్రమాలు
- బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, కె.లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కేసీఆర్ పాలన పోవాలంటే మరో ఉద్యమం ప్రారంభం కావాల్సిందేనని, ఆయన్ను గద్దె దించేందుకు బీజేపీ మరో ఉద్యమానికి సిద్ధమైందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'కేసీఆర్ హటావో – తెలంగాణ బచావో– బీజేపీకి జితావో' నినాదంతో పోరాటం ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. ఇందు కోసం మూడు విడతలుగా బీజేపీ ఉద్యమ కార్యక్రమాలు సిద్ధం చేసిందన్నారు. ఆగస్టు 16 నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యాచరణ సెప్టెంబర్ వరకు సాగుతుందని తెలిపారు.

- మొదటి విడత కార్యక్రమాల్లో భాగంగా ఆగస్టు 16న పల్లెబాట, బస్తీబాట, 17న బాధితులు, దరఖాస్తుదారులతో మండల, డివిజన్ల వారీగా ముట్టడి కార్యక్రమం చేపట్టనున్నట్టు చెప్పారు. ఆగస్టు 18న అసెంబ్లీ కేంద్రంగా ప్రధాన రహదారుల్లో రాస్తారోకో, ధర్నా, ముట్టడి అసెంబ్లీ కేంద్రాల్లో దిగ్బంధనం ఉంటుందన్నారు.
- రెండో విడత కార్యక్రమాల్లో భాగంగా ఆగస్టు 23న అధికార పార్టీ ఎమ్మెల్యేల ఘెరావ్, 24న మంత్రుల ఘెరావ్ కార్యక్రమాలతోపాటు ఆగస్టు 27న జిల్లా కలెక్టర్ కార్యాలయ ముట్టడి, జైల్ భరో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.
- మూడో విడత కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ మొదటివారంలో హైదరాబాద్‌లో మిలియన్ మార్చ్ చేపడుతున్నట్టు చెప్పారు.



జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌కు శ్రీవారి చిత్రపటాన్ని అందజేస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

తిరుమల: తిరుమల శ్రీవారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్ సోమవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఆయనకు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం జస్టిస్ భుయాన్ హుండీలో కానుకలు సమర్పించారు. వీరికి రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేశారు. కరుణాకర్‌రెడ్డి శాలువతో సత్కరించి తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటం అందించారు.

భక్తుల రక్షణే ప్రధాన ధ్యేయం

- అటవీశాఖ సిబ్బందితో ప్రత్యేక భద్రత
- రక్షణ కోసం భక్తులకు చేతికర్ర అందిస్తాం
- టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి



తిరుపతి సిటీ: తిరుమల వచ్చే శ్రీవారి భక్తుల ప్రాణ రక్షణే తమ ప్రధాన ధ్యేయమని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం తిరుపతిలోని పద్మావతి అతిథి గృహంలో మీడియాతో మాడుతూ.. చిరుత దాడిలో గతంలో కౌశిక్ గాయపడటం, ఇటీవల చిన్నారి లక్షిత ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా టీటీడీ అప్రమత్తమై అటవీ శాఖ అధికారులు, పోలీసులతో కలసి కొన్ని నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. అలిపిరి, శ్రీవారి మెట్టు నడక మార్గాల్లో 12 ఏళ్ల వయసు లోపు పిల్లలతో వచ్చే భక్తులకు ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. పెద్దలను మాత్రం రాత్రి 10 వరకు అనుమతిస్తామని తెలిపారు. నడక దారిలో వెళ్లే ప్రతి భక్తునికి సహకారం కోసం ఊత కర్ర అందిస్తామన్నారు. ఘాట్ రోడ్డులో ద్విచక్ర వాహనాలను ఉదయం 6 నుంచి సాయంత్రం 6గంటల వరకు మాత్రమే అనుమతిస్తామని చెప్పారు. భక్తులను గుంపులుగా వెళ్లేందుకు అనుమతిస్తూ.. ముందు వెనుక అటవీశాఖ సెక్యూరిటీతో భద్రత కల్పిస్తామన్నారు.. అటవీశాఖ అధికారులు నిపుణులైన భద్రతా సిబ్బందిని నియమించుకోవాలని సూచించామని.. వారి వేతనాలు టీటీడీయే భరిస్తుందన్నారు.

జంతువులకు ఆహారం అందించడం నిషేధం

నడక దారిలో వెళ్లే భక్తులు సాధు జంతువులకు ఆహారం అందించడం నిషేధించామని, అలా అందించే వారిపై చర్యలు తప్పవని కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. నడక దారి లోని దుకాణదారులు, హోటళ్ల యజమానులు వ్యర్థాలను బయట వేయరాదని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తిరుపతి నుంచి తిరుమల వరకు నడకమార్గంలో సుమారు 500 కెమెరాలను అమర్చనున్నామని, అవసరమైతే డ్రోన్ వ్యవస్థను ప్రవేశపెట్టనున్నట్టు పేర్కొన్నారు. వైల్డ్‌లైఫ్ అవుట్ పోస్టులు 24 గంటలు పనిచేస్తాయని, డాక్టర్లు సైతం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దారి పొడవునా సుమారు 30 అడుగుల వరకు వెలుతురు ఉండేలా ఫోకస్ లైట్లు అమర్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలిపిరి భూదేవి కాంప్లెక్స్, శ్రీవారి మెట్టు వద్ద 15వేల దివ్య దర్శనం టోకెన్లు జారీ చేస్తున్నామని, మధ్యలో వీటిని తనిఖీ చేయాల్సిన అవసరం లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. టోకెన్లు పొందిన భక్తులు రోడ్డు మార్గాన సైతం వెళ్లేందుకు అనుమతిస్తామని తెలిపారు. ఫెన్సింగ్ ఏర్పాటుపై అటవీ అధికారులతో చర్చించామని.. కేంద్ర అటవీశాఖ ఉన్నత స్థాయి కమిటీ వేసి అధ్యయం చేసిన తర్వాత నిర్ణయం ఉంటుందన్నారు.

చిక్కిన చిరుత

శేషాచలం అడవుల్లో టీటీడీ అటవీ శాఖ, రాష్ట్ర అటవీ శాఖ సంయుక్తంగా ఏర్పాటు చేసిన బోనులో సోమవారం తెల్లవారుజామున చిరుత చిక్కుకుంది. నెల్లూరు జిల్లాకు చెందిన లక్షిత(6) అనే బాలికపై వన్యమృగం బలి తీసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వన్యమృగం దాడికి పాల్పడిన శేషాచల అటవీ ప్రాంతంలోని అలిపిరి–తిరుమల నడక మార్గంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, ఘంటా మండపం మధ్య మూడు బోన్లను ఉంచారు. సోమవారం వేకువజామున ఒక బోనులో మగ చిరుత చిక్కింది. ఆ చిరుత వయసు ఐదేళ్లకు పైగా ఉంటుందని అటవీ అధికారులు నిర్ధారించారు.

జిల్లా వార్తలు

సీయూఈటీలో ఖమ్మం విద్యార్థిని ప్రతిభ

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీలోని అన్ని విభాగాల్లో సీటు




వున్నవ రిషిక

ఖమ్మంసహకారనగర్: కామన్ యూనివర్సిటీ ఎంట్రెన్స్ టెస్టు (సీయూఈటీ)లో ఖమ్మానికి చెందిన విద్యార్థిని ప్రతిభ కనబర్చింది. జిల్లా కేంద్రంలోని బుర్హాన్‌పురానికి చెందిన వున్నవ రిషిక కేంద్రీయ విద్యాలయంలో పదో తరగతి వరకు చదవగా, ఇంటర్మీడియట్ హైదరాబాద్‌లో పూర్తి చేసింది. ఈ క్రమంలో సీయూఈటీ రాసిన ఆమె 541 మార్కులు సాధించగా.. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (షిల్లాంగ్ క్యాంపస్)లోని అన్ని విభాగాల్లో సీటు సాధించింది. తెలంగాణ నుంచి అన్ని విభాగాల్లో సీటు సాధించిన ఏకైక విద్యార్థినిగా రిషిక గుర్తింపు సాధించింది. ఆమె ఈ విద్యా సంవత్సరం(2023–24) బీఏ హానర్స్ రీసెర్చ్ ఇంగ్లిష్ కోర్సు అభ్యసించాలని నిర్ణయించుకుంది. కాగా, రిషిక తండ్రి ఇంగ్లిష్ ఉపాధ్యాయుడైన కిరణ్‌కుమార్ కరోనా సమయంలో కన్నుమూశాడు. ఐక్యరాజ్య సమితిలో ఉద్యోగం సాధించడమే తన లక్ష్యంగా రిషిక చెబుతోంది.

పంద్రాగస్టు ఘనంగా జరుపుకోవాలి

ఐటీడీఏ ఏపీఓ డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ



గిరిజన దర్బార్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

భద్రాచలం: ఏజెన్సీలోని గిరిజన, గిరిజనేతరులందరూ స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని ఐటీడీఏ ఏపీఓ (జనరల్) డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ ప్రాంతాల ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి సంబంధిత యూనిట్ అధికారులకు అందజేశారు. అర్హులైన ప్రతీ గిరిజన కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. అలాగే, మంగళవారం ఐటీడీఏలో జరిగే స్వాతంత్య్ర వేడుకలకు ఉద్యోగులు సకాలంలో హాజరుకావాలని తెలిపారు. సమావేశంలో ఐటీడీఏ ఏఓ భీమ్, అధికారులు సురేష్ బాబు, ఆర్.శ్రీనివాస్, రమణయ్య, అశోక్‌కుమార్, ప్రభాకర్‌రావు, మునీర్‌పాషా, ఆదినారాయణ, దుర్గయ్య, నాగభూషణం పాల్గొన్నారు.

లీజ్‌కు భూమి.. నీరు కొనుగోలు!



ఇజ్రాయిల్‌లోని పాలీహౌస్‌లో ఉద్యాన పంటల సాగు వివరాలు తెలుసుకుంటున్న తెలంగాణ బృందం



చెట్టుకు అమర్చిన సెన్సార్

ఇదీ ఇజ్రాయిల్‌లో వ్యవసాయం తీరు

- పంట ధర నిర్ణయించేది రైతులే...
- ఇక్కడితో పోలిస్తే వైవిధ్యంగా వ్యవసాయం...
- ఎక్కువగా ఉద్యాన పంటలే సాగు
- అధ్యయనానికి వెళ్లొచ్చిన డీఏఓ, రైతుబంధు జిల్లా కన్వీనర్

సాక్షి, ఖమ్మం డెస్క్: మన ప్రాంతంతో పోలిస్తే ఇజ్రాయిల్ దేశంలో వ్యవసాయం పూర్తి భిన్నంగా ఉంటుంది. సాంకేతికంగా అభివృద్ధి చెందిన దేశం కావడంతో అక్కడ వ్యవసాయంలోనూ సాంకేతికత అవలంబిస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు. ప్రభుత్వం నుంచి భూమి లీజ్‌కు తీసుకునే అక్కడి వ్యవసాయదారులు సాగు అవసరాలకు నీటిని కొనుగోలు చేస్తారు. ఎక్కువగా డ్రిప్ ఇరిగేషన్ విధానాన్ని అవలంబించే అక్కడి రైతులే.. పంట ఉత్పత్తులకు ధరలు నిర్ణయిస్తారు. ఇలా మనతో పోలిస్తే అనేక అంశాల్లో విభిన్నంగా అక్కడి వ్యవసాయం ఉంటుంది. ఇజ్రాయిల్‌లో వ్యవసాయ విధానాన్ని అధ్యయనం చేసేందుకు తెలంగాణ నుంచి 29మంది వ్యవసాయ అధికారులు, రైతు ప్రతినిధులతో కూడిన బృందం ఈనెల 5నుంచి 10తేదీ వరకు అక్కడ పర్యటించింది. ఈ బృందంలో ఖమ్మం నుంచి వ్యవసాయ అధికారి(డీఏఓ) విజయనిర్మల, రైతుబంధు సమన్వయ సమితి కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు ఉన్నారు. ఈసందర్భంగా వారు అక్కడ సాగు విధానాలు, యాంత్రీకరణ, దిగుబడులు, మార్కెటింగ్, రైతుల స్థితిగతులపై చేసిన అధ్యయనం వివరాలను వెల్లడించారు.

అన్నింటా సాంకేతికత.. రాయితీలు నిల్

ఇజ్రాయిల్ సాంకేతికంగా అభివృద్ధి చెందిన దేశం కావడంతో వ్యవసాయం చేసే వారు కూడా సాంకేతిక విధానాలు పాటిస్తారు. ఆ దేశంలో కేవలం 4 శాతం మంది మాత్రమే రైతులు వ్యవసాయం చేస్తారు. అక్కడ ప్రభుత్వం నుంచే 49, 99 ఏళ్లకు భూములు లీజ్‌కు తీసుకుని సాగుకు ఉపయోగిస్తారు. అయితే, సాగు చేసే వారికి ప్రభుత్వం నుంచి ఎలాంటి రాయితీలు, ప్రోత్సాహకాలు అందవు. దీనికి తోడు ప్రతికూలమైన పరిస్థితులు ఉన్నా వ్యవసాయం చేస్తుండడం విశేషం.

నీరు కొంటారు.. ఐటీ చెల్లిస్తారు...

అక్కడ 80 శాతం ఎడారి ప్రాంతమే అయినా సముద్ర తీరం, ఎడారి ప్రాంతంలోనే వ్యవసాయం చేస్తారు. ఆ దేశంలో నీటి సమస్య ఎక్కువగా ఉండడంతో సముద్రపు నీటిని శుద్ధి చేసి(ఉప్పు తీసి) సాగు, తాగు అవసరాలకు ఉపయోగిస్తారు. అయితే, వారు ఈ నీటిని కూడా కొనుగోలు చేయాల్సిందే. కాగా, వృథా నీటిని కూడా శుద్ధి చేసి పంటల సాగులో వినియోగిస్తారు. పంట సాగు వ్యయంలో 40 శాతం నీటి కొనుగోలుకే వెచ్చిస్తారు. ఇంకా 40 శాతం ఖర్చు కార్మికులకు, 20 శాతం ఖర్చు మందులకు వాడతారు. అయితే, పంట నుంచి అన్ని ఖర్చులు పోను 30 శాతానికి పైగా ఆదాయం లభిస్తుంది. కాగా, ఇజ్రాయిల్‌లో రైతులు ఆదాయంలో 40శాతం మేర ఆదాయ పన్ను చెల్లిస్తారు!

డ్రిప్ విధానమే..

అక్కడి భూములు చదునుగా ఉండవు. అందుకే పంటల సాగులో డ్రిప్ ఇరిగేషన్ విధానం అవలంబిస్తారు. ఎరువులను కూడా డ్రిప్ ద్వారా(ఫెర్టిగేషన్)నే అందిస్తారు. ఎరువులు ఇష్టారాజ్యంగా కాకుండా భూసార పరీక్షలకు అనుగుణంగా మాత్రమే వినియోగిస్తారు. రసాయన ఎరువులతో పాటు సేంద్రియ ఎరువులను కూడా ఇజ్రాయిల్ రైతులు తప్పక వాడతారు.

ఉద్యాన పంటలు ప్రత్యేకం

ఇజ్రాయిల్‌లో రైతులు ఆహార పంటలను పండిస్తారు. అయితే ప్రధానంగా ఉద్యాన పంటల సాగే ఎక్కువ. పండ్లు, కూరగాయల పంటల సాగుకు ప్రాధాన్యమిస్తారు. నిమ్మ జాతుల పంటలు అధికంగా సాగు చేసే రైతులు మామిడి, అవకోడ, దానిమ్మ, యాపిల్, దానిమ్మ, చెర్రీస్, బ్లూబెర్రీ, టమాట, కొత్తిమీర, ఆలుగడ్డ, క్యారెట్, క్యాప్సికం, మొక్కజొన్న, పత్తి, గోధుమ వంటి పంటలను పండిస్తారు. మామిడి, అవకోడ పంటల సాగులో స్ప్రింక్లర్లను వినియోగిస్తారు. పంటలేకాక డెయిరీ ఫామ్‌ల నిర్వహణ కూడా ఎక్కువే. 40 నుంచి 45 లీటర్ల వరకు పాలిచ్చే ఆవులను ఎక్కువగా పెంచుతారు.

వ్యక్తిగతంగా.. సామూహికంగా

అక్కడి రైతులు సహకార వ్యవసాయమే కాక వ్యక్తిగత వ్యవసాయం కూడా చేస్తారు. 300 మంది వరకు రైతులు కలిసి సహకార వ్యవసాయం చేయడం అక్కడ సాధారణ విషయం. కాగా, పంటల సాగులో సాంకేతిక వినియోగం అధికంగా ఉంటుంది. సెన్సార్లు, కెమెరాలను వినియోగించి పంటల స్థితిగతులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటారు. వ్యవసాయ క్షేత్రాల్లోనే కాక మార్కెట్లలోనూ కోల్డ్ స్టోరేజీలు ఉంటాయి.

నేరుగా అమ్మకం

ఇజ్రాయిల్‌లో రైతులు పండించిన పంటను మార్కెట్‌లో నేరుగా విక్రయిస్తారు. ఏ దశలో కూడా మధ్యవర్తుల ప్రమేయం ఉండదు. పంట ధరను రైతులే నిర్ణయిస్తారు. కోల్డ్ స్టోరేజీలు ఉండటం ద్వారా పంటను భద్రపర్చడం సులువవుతుంది.

కమ్యూనిస్టుల ఐక్యత చారిత్రక అవసరం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న కూనంనేని, పక్కన సీపీఐ, సీపీఎం నాయకులు

బోనకల్: కమ్యూనిస్టుల ఐక్యత ప్రస్తుతం చారిత్రక అవసరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. బోనకల్ మండలం గోవిందాపురం(ఎల్)లో సోమవారం తమ్మారపు వెంకటకోటయ్య సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రధాన కూడళ్లలో పార్టీ పతాకాలను సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ఆవిష్కరించారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ.. భూమి, భుక్తి, పేద ప్రజల విముక్తి కోసం తెలంగాణ సాయుధ పోరాటంలో గోవిందాపురం(ఎల్) గ్రామం కీలక భూమిక పోషించిందని గుర్తుచేశారు. మండలంలోని ఏ గ్రామానికి వెళ్లినా పోరాటవీరుల స్మారక స్థూపాలు కనిపిస్తాయని తెలిపారు. కడవరకు కమ్యూనిస్టుగా జీవించిన తమ్మారపు వెంకటకోటయ్య ధన్యజీవి అని కొనియాడారు. కాగా, కేంద్రంలోని మోదీ పాలనలో దేశం క్లిష్ట పరిస్థితుల్లో కూరుకుపోయి పేదలు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యాన ప్రజాసమస్యలపై జరిగే పోరాటాలతో పాటు ఎన్నికల్లోనూ వామపక్షాలు ఐక్యంగా ఉంటే ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాగం హేమంతరావు, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు, నాయకులు పాలడుగు భాస్కర్, తాటి వెంకటేశ్వర్లు, ఏపూరి రవీంద్రబాబు, బెజవాడ రవి, తోటపర్తి గోవిందరావు, మందడపు రాణి, యంగల ఆనందరావు, తూము రోషన్‌కుమార్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారమే అజెండా

ఏఐజీఈటీఓఏ ఆల్ ఇండియా ప్రెసిడెంట్ వీరభద్రరావు



మాట్లాడుతున్న అసోసియేషన్ ప్రెసిడెంట్ వీరభద్రరావు

ఖమ్మంమయూరిసెంటర్: బీఎస్ఎన్ఎల్ సంస్థలోని ఉద్యోగుల సమస్యలు, పదోన్నతుల సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం ఆల్ ఇండియా గ్రాడ్యుయేట్ ఇంజనీర్స్, టెలికాం ఆఫీసర్స్ అసోసియేషన్ (ఏఐజీఈటీఓఏ) పనిచేస్తోందని అసోసియేషన్ ఆల్ ఇండియా ప్రెసిడెంట్ జి.వీరభద్రరావు వెల్లడించారు. ఖమ్మంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం జిల్లా అధ్యక్షుడు ఎం.రమేష్ అధ్యక్షతన సోమవారం జరగగా ఆయన మాట్లాడారు. బీఎస్ఎన్ఎల్ ఆఫీసర్ల మూడో సభ్యత్వం గుర్తింపులో భాగంగా వచ్చేనెల 12న ఎన్నికలు జరగనున్నాయన్నారు. ఈ ఎన్నికల్లో ఎనిమిది సంఘాలు పాల్గొంటుండగా, ప్రస్తుతం అతి పెద్ద అసోసియేషన్‌గా గుర్తింపు పొందిన ఏఐజీఈటీఓఏను మళ్లీ అదే స్థాయిలో నిలపాలని కోరారు. ఉద్యోగుల సమస్యలే కాకుండా సంస్థ ఉన్నతి, అభివృద్ధికి తమ అసోసియేషన్ విశేషంగా కృషి చేస్తుందని గుర్తుచేశారు. సమావేశంలో అసోసియేషన్ సర్కిల్ అధ్యక్షుడు ఆర్.కరుణాకర్, బాధ్యులు బి.లక్ష్మణ్, ఎం.మాధవరావు, ఎస్.సురేశ్, టి.నరేందర్‌కుమార్, టి.గోవింద్, ఎన్‌వీ గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ బాధ్యులు

ఖమ్మంస్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల స్థాయి సీనియర్ ఫుట్‌బాల్ జట్టును సోమవారం ఎంపిక చేశారు. ఎంపిక పోటీలకు రెండు జిల్లాల నుంచి 40 మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వాసుదేవ్, ఎస్కే ముబీన్, రాకేశ్, జె.వినయ్‌కుమార్, బి.పవన్‌కుమార్, కె.సాయిరాం, ఇషాక్, బి.గోపీచంద్, విల్సన్, ఎలీషానాయక్, పి.శివ, శరత్, నోమేల్ జాక్సన్, అశ్రిత్, జేమ్స్, చంద్రశేఖర్, సంతోష్, యశ్వంత్, అబాబు బక్కర్, వి.కల్యాణ్‌తో జట్టును ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే, స్టాండ్‌బైగా గోపీనాథ్, సీహెచ్ శివ, అఖిలేశ్, కె.సునీల్, చక్రిని ఎంపిక చేశామని చెప్పారు. ఈ జట్టు ఈ నెల 16 నుంచి వనపర్తి జిల్లా పెబ్బేరులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని వివరించారు. కార్యక్రమంలో డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, అథ్లెటిక్స్ చీఫ్ కోచ్ ఎండీ గౌస్, అక్తర్, రమణ, శ్రీను, ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.ఆదర్శ్ కుమార్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.